

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY
తెలుగు దినపత్రిక
PS NEWS
మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 05-03-2025 | సంపుటి - 21 | సంచిక - 314 | రూ : 4 | పేజీలు: 8



## రూ.1,891 కోట్ల బకాయిలు చెల్లించండి

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి

దిల్లీ: భారత ఆహార సంస్థ(ఎఫ్‌సీఐ) కు 201415 ఖరీఫ్ కాలంలో తెలంగాణ ప్రభుత్వం సరఫరా చేసిన బియ్యానికి సంబంధించి చెల్లించాల్సిన రూ.1,468.94 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం ఇక్కడ కేంద్రమంత్రితో భేటీ అయి ఈ అంశంపై చర్చించారు. 201415లో అదనపు లెవీ సేకరణకు సంబంధించిన మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం బకాయిపడి పదేళ్లయినందున వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన కింద 2021 మే నుంచి 2022 మార్చి వరకు సరఫరా చేసిన అదనపు బియ్యంతోపాటు 2022 ఏప్రిల్‌లో సరఫరా చేసిన బియ్యం బకాయిలు రూ.343.27 కోట్లనూ విడుదల చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. జాతీయ ఆహారభద్రత చట్టం పరిధిలోకి రాని వారికి 2021 జూన్ నుంచి 2022 ఏప్రిల్ వరకు పంపిణీ చేసిన బియ్యానికి సంబంధించిన బకాయిలు రూ.79.09 కోట్లు వెంటనే విడుదల చేయాలనీ కేంద్ర మంత్రిని అభ్యర్థించారు. సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్) గడువును ప్రతిసారీ నెల రోజులు కాకుండా.. ఒకేసారి నాలుగు నెలలు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని కేంద్ర మంత్రి జోషికి ముఖ్యమంత్రి వివరించారు.

### * 4 వేల మెగావాట్ల మంజూరును పునరుద్ధరించండి..

రాష్ట్రంలో 4 వేల మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తికి 'పీఎం కుసుమ్' కింద గతంలో ఇచ్చిన అనుమతులను పునరుద్ధరించాలని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ మంత్రిత్వశాఖ బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్న మంత్రి ప్రహ్లాద్ జోషికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి తరువాయి 2లో

## ఆధిక్యంలో భాజపా అభ్యర్థి..

- రెండో స్థానంలో కాంగ్రెస్..
- కొనసాగుతున్న కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు
- ఏడో రౌండ్ పూర్తయ్యే సమయానికి అంజిరెడ్డికి 5 వేల మెజార్టీ
- నేటి మధ్యాహ్నానికి మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్క తేలే అవకాశం

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్‌మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా అభ్యర్థి ఆధిక్యంలో ఉన్నారు. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ఏడో రౌండ్ ముగిసే సమయానికి చిన్నమైల్ అంజిరెడ్డి 51,719 ఓట్లు సాధించి 5,886 ఆధిక్యంలో నిలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి 45,833 ఓట్లతో రెండో స్థానంలో, బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ 38,364 ఓట్లతో మూడో స్థానంలో ఉన్నారు. లెక్కింపు కరీంనగర్‌లోని తరువాయి 2లో



## బస్సులకు... యజమానులు మహిళలే




- మహిళా సమాఖ్యలకు పంపిణీ చేయనున్న రాష్ట్ర సర్కారు
- దేశంలో తొలిసారి.. మొదటి విడతగా 150 కొనుగోలు
- ఆర్టీసీకి అద్దెకు..
- ప్రతినెలా రూ.77,220 చెల్లించనున్న రోడ్డు రవాణా సంస్థ

8వ తేదీ 50 ప్రారంభం

- ప్రభుత్వ ఉత్తర్వుల జారీ

హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళా సంఘాల సభ్యులు ఆర్టీసీ బస్సులకు యజమానులు కానున్నారు. ప్రతి మండల మహిళా సమాఖ్యకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 600 బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చేందుకు అనుమతిస్తూ తరువాయి 2లో



## కూటమి.. ఓట్ల సునామీ

- రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో భారీ మెజారిటీతో గెలుపు
- ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు 82,320 ఓట్ల ఆధిక్యం
- పేరాబత్తుల రాజశేఖరానికి 77,461 ఓట్ల మెజారిటీ
- ఎన్డీయే ప్రభుత్వంపై ప్రజల్లో చెక్కుచెదరని ఆదరణ

తరువాయి 2లో

## ప్రభుత్వ పాఠశాలల్లో 'యాక్టివ్ ఆంధ్ర'

- బడిలో రోజుకో గంట ఆటలు
- ప్రయోగాత్మకంగా మంగళగిరిలో అమలు

2లో




## పాఠాలు చెప్పిన ప్రథమ పౌరురాలు

పూర్వాశ్రమంలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

తరువాయి 2లో





## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- రాజకీయ సుపరిపాలనలో ఎన్డీయే నేతలే భాగస్వాములు
- ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు

అమరావతి: రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రజలందరికీ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. అదే సమయంలో రాజకీయ సుపరిపాలన ఉంటుందని, దానిలో ఎన్డీయే నాయకులే భాగస్వాములుగా ఉంటారని స్పష్టం చేశారు. వైకాపా నాయకులు రాజకీయాల్ని కలుషితం చేశారని, రాజకీయం ముసుగులో నేరాలు, ఘోరాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఎవరు తరువాయి 2లో

## లిథియం స్వయం సమృద్ధి దిశగా భారత్

- కిషన్‌రెడ్డి



కోల్‌కతా: దేశీయంగా పెరుగుతున్న లిథియం వంటి కీలక ఖనిజాల డిమాండును మరో మూడు నాలుగేళ్లలో మనదేశమే సొంతంగా తీర్చగలిగే స్థాయికి చేరుతుందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) 175 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతాలో జరుగుతున్న ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విలేకరు తరువాయి 2లో

# ఆధిక్యంలో భాజపా అభ్యర్థి

(మొదటిపేజీ తరువాయి)

అంబేద్కర్ ఇండోర్ మైదానంలో నిర్విరామంగా కొనసాగుతోంది. 21 టేబుళ్లపై రౌండ్‌కు 21వేల ఓట్లను లెక్కిస్తున్నారు. మొత్తం 11 రౌండ్లు లెక్కించాల్సి ఉండగా మంగళవారం అర్ధరాత్రి తర్వాత 2 గంటలకు ఏడు రౌండ్లు పూర్తయ్యాయి. మొదటి ఐదు రౌండ్లలో భాజపా అభ్యర్థి అంజిరెడ్డి ఆధిక్యంలో కొనసాగగా.. ఆరు, ఏడో రౌండ్‌లలో కాంగ్రెస్ అభ్యర్థికి స్వల్ప లీడ్ వచ్చింది. బుధవారం మధ్యాహ్నానికి మొదటి ప్రాధాన్య ఓట్లలో ఎవరికి ఎక్కువ ఓట్లు వచ్చాయనేది తెలిసే అవకాశముంది. మొత్తం రౌండ్లు పూర్తయిన తర్వాతే గెలుపునకు అవసరమైన కోటా ఓట్ల సంఖ్యను ప్రకటిస్తారు. గత నెల 27న జరిగిన ఎన్నికల్లో ఈ స్థానంలో 2,50,106 ఓట్లు పోలయ్యాయి. మరో 4వేల వరకు తపాలా ఓట్లు పడ్డాయి. ఇందులో చెల్లినవి, చెల్లనివి పరిగణనలోకి తీసుకుని విజేతకు అవసరమైన ఓట్ల సంఖ్యను నిర్ణయిస్తారు. ఇప్పుడున్న వివరాల ప్రకారం 1,14,000 (ఒక అంచనా)కుపైగా ఎవరికి వస్తే వారు పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుస్తారు. ఈ సంఖ్య మొదటి ప్రాధాన్యంలో ఏ అభ్యర్థీ చేరుకునే అవకాశం కనిపించడం లేదు. దీంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యంగా మారనుంది.

### ఓటరు తడబాటు..

ఓటు వేసే విషయంలో చదువుకున్న వాళ్ల తడబాటు ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపించింది.మొత్తం ఓట్లు 2,50,106 పోలవగా అందులో 8 శాతానికిపైగా చెల్లనివి ఉండటం గమనార్హం. ఇదే స్థానానికి 2019 జరిగిన ఎన్నికల్లోనూ 9,932 చెల్లలేదు. తాజాగా జరిగిన మెదక్ నిజామాబాద్ ఆదిలాబాద్ కరీంనగర్ ఉపాధ్యాయ ఎన్నికల ఫలితాల్లోనూ 897, వరంగల్ ఖమ్మం నల్గొండ ఉపాధ్యాయ స్థానంలో 494 ఓట్లు చెల్లుబాటవలేదు. ఈసారి కొందరు ఓటర్లు తమకు బరిలో ఉన్న ఏ అభ్యర్థీ నచ్చలేదని పలువురి ఫొటోలపైన క్రాస్ మార్కు చేశారు. ఇంకొందరు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఫల్యాలను, మరికొందరు పథకాల లబ్ధి అందలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ రాశారు.

### * 21 వేల పైచిలుకు చెల్లని ఓట్లతో చిక్కు

ఈసారి పట్టభద్రుల ఓట్ల లెక్కింపులో ప్రాథమికంగా 21వేల పైచిలుకు బ్యాలెట్ పత్రాలను చెల్లని ఓట్ల జాబితాలో చేర్చారు. వీటి విషయంలో అభ్యర్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయిన తరువాత మరోసారి వీటిని పరిశీలించి పక్కాగా ఎన్ని చెల్లడం లేదనేది ఎన్నికల అధికారి వెల్లడిస్తారు. అందువల్లే గెలుపు కోటా ఎంతనేది ఇంకా నిర్ధారించలేదు. ప్రస్తుతం ఆయా రౌండ్ల లెక్కింపు సమయంలోనూ 5 నుంచి 10 చెల్లని ఓట్లు కొత్తగా వచ్చి చేరుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరస్కరణకు గురైన ఓట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు.

# కూటమి.. ఓట్ల సునామీ



అమరావతి : రాష్ట్రంలో అధికార కూటమికి ప్రజలు మరోసారి బ్రహ్మరథం పట్టారు. సార్వత్రిక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో మొదటిసారి జరిగిన ఉమ్మడి గుంటూరు కృష్ణా, ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అఖండ విజయం కట్టబెట్టారు. ఈ స్థానాల్లో కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరం భారీ మెజారిటీలతో గెలుపొందారు. దాదాపు తొమ్మిది నెలల క్రితం జరిగిన సాధారణ ఎన్నికల్లో 164 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్‌సభ స్థానాలు గెలుచుకున్న కూటమికి ప్రజల్లో ఆదరణ చెక్కు చెదరలేదని, మరింతగా పెరిగిందని ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు రుజువు చేశాయి. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో కూటమి అభ్యర్థులు మొదటి ప్రాధాన్య ఓటుతోనే గెలుపొందడం ఒక ప్రత్యేకత అయితే.. శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో మాదిరిగా భారీ మెజారిటీలు సాధించడం మరో విశేషం. 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి 57 శాతం ఓట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా ఈ ఎన్నికల్లో అంతకు మించి 65 శాతం ఓటు షేర్‌తో సత్తా చాటింది. తమ ప్రభుత్వ విధానాలు, చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నారనడానికి ఈ ఎన్నికలో ప్రజలు బ్రహ్మరథం పట్టడమే నిదర్శనమని కూటమి పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యావంతులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు కూటమి ప్రభుత్వంపై విశ్వాసాన్ని ఈ ఎన్నికల ద్వారా మరోసారి చాటిచెప్పారని విశ్లేషిస్తున్నారు. అధికార కూటమిలోని మూడు పార్టీల నాయకుల నుంచి కార్యకర్తల వరకు ఏకతాటిపై నడిచి అఖండ విజయం సాధించారు.

### అఖండ విజయం

ఉమ్మడి కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పీడీఎఫ్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుపై 82,320 ఓట్ల భారీ మెజారిటీ సాధించారు. ఆయనకు 1,45,057 ఓట్లు వచ్చాయి. ఇవి మొత్తం చెల్లుబాటయిన ఓట్లలో 67.51 శాతం. ఈ జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల్లో కూటమికి 58.19 శాతం ఓట్లు రాగా ఇప్పుడు అది 67.51 శాతానికి పెరిగింది. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ తెదేపా అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం 77,461 ఓట్ల మెజారిటీతో పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులుపై విజయభేరి మోగించారు. ఆయనకు 1,24,702 ఓట్లు వచ్చాయి. ఇవి మొత్తం చెల్లుబాటయిన ఓట్లలో 62.59 శాతం. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో ఈ జిల్లాల్లో కూటమికి 59.28% ఓటు షేర్ రాగా, ఎమ్మెల్సీ ఎన్నికల్లో 62.59 శాతానికి పెరిగింది. ఈ నాలుగు ఉమ్మడి జిల్లాల్లో సార్వత్రిక ఎన్నికల్లో 58 శాతం ఓట్లు వచ్చాయి. ఇప్పుడు 65 శాతం వచ్చింది.

# బస్సులకు యజమానులు మహిళలే

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బస్సుల కొనుగోలుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) వద్ద ఉండే కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ నుంచి తొలి విడతగా రూ.54 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. బస్సుల అద్దెపై ఇప్పటికే ఆర్టీసీతో సెర్ప్ ఒప్పందం కుదుర్చుకుంది. దీంతో ఒక్కోటి రూ.36 లక్షల విలువైన బస్సులు మహిళా సమాఖ్యల సొంతం కానున్నాయి.

### సెర్ప్ సీఈవో లేఖ మేరకు..

మహిళాశక్తి పథకం కింద రాష్ట్రంలోని 600 మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొని ఆర్టీసీకి అద్దెకిచ్చేందుకు అనుమతి కోరుతూ సెర్ప్ సీఈవో దివ్యా దేవరాజన్ ప్రభుత్వానికి గత జనవరిలో లేఖ రాశారు. ఏడేళ్లపాటు ఒక్కో బస్సుకు నెలకు రూ.77,220 చొప్పున అద్దెను ప్రతినెలా ఐదో తేదీలోపు మహిళా సమాఖ్యలకు చెల్లించేందుకు ఆర్టీసీ అంగీకరించిందని అందులో పేర్కొన్నారు. ఆ లేఖను పరిగణనలోకి తీసుకొన్న ప్రభుత్వం తాజాగా బస్సుల కొనుగోలుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ‘‘మొదటి విడతలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని 150 మహిళా సమాఖ్యలకు 150 బస్సులను కొనుగోలు చేయాలి. రెండో దశలో మిగిలిన 450 బస్సులు కొనాలి. మండల మహిళా సమాఖ్యలు పెట్టుబడి పెట్టిన మొత్తానికి ఏడేళ్లపాటు ప్రతినెలా ఐదో తేదీలోపు ఆర్టీసీ నెలవారీ అద్దె చెల్లిస్తుంది. ఆర్టీసీ అద్దె బస్సులని ‘ఆర్సీ’లో నమోదు చేయాలి’’ అని పంచాయతీరాజ్ కార్యదర్శి లోకేశ్‌కుమార్ ఇచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అద్దె బస్సుల పథకం మండల మహిళా సమాఖ్యలకు ఆర్థికంగా ఊతమిస్తుందని, ఆర్టీసీకి బస్సుల లభ్యతనూ పెంచుతుందని తెలిపారు. బస్సులకు అద్దె రూపేణా ఆర్టీసీ ప్రతినెలా చెల్లించే మొత్తం సెర్ప్ కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ కింద మండల సమాఖ్యల ఖాతాల్లో జమ అవుతుంది. ఈ మొత్తాన్ని మహిళా సంఘాల్లోని సభ్యుల అభ్యున్నతికి వినియోగిస్తారు.

### * తొలుత నాలుగు రీజియన్లకు..

ఆర్టీసీలో 11 రీజియన్లు ఉన్నాయి. మొదటి దశలో వచ్చే 150 బస్సులను కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్ రీజియన్లకు కేటాయించనున్నారు. వీటిలో 50 బస్సులు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన బస్సులు వారం, పది రోజుల్లో అందుబాటులోకి వస్తాయని ఆర్టీసీ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లకు రెండో విడతలో 450 బస్సులు రానున్నాయి. మండల సమాఖ్యల నుంచి వచ్చే బస్సుల్ని ఏయే రూట్లలో నడపాలో ఆర్టీసీ నిర్ణయిస్తుంది. అయితే, ఆయా మండలాలున్న జిల్లావాసులకు ఉపయోగపడేలా నడిపించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. అవసరాన్ని బట్టి పెద్ద పట్టణాలకు, హైదరాబాద్‌కు కూడా నడిపిస్తామని ఆర్టీసీ ఉన్నతాధికారి వివరించారు. మండల సమాఖ్యల నుంచి వచ్చే బస్సుల్లో సింహభాగం ‘పల్లెవెలుగు’ రానున్నాయి. కొన్ని ఎక్స్‌ప్రెస్‌లు ఉంటాయి. ప్రస్తుతం ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ తీవ్రంగా ఉంది. పలు రూట్లలో కొత్త బస్సులు, అదనపు సర్వీసులు నడిపించాలని ప్రయాణికులతోపాటు ఎమ్మెల్యేల నుంచి పెద్దఎత్తున వినతులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మహిళా సమాఖ్యల ద్వారా వచ్చే బస్సులతో కొంత ఉపశమనం కలగనుంది.

### 8న 50 బస్సుల ప్రారంభం

ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 50 ఆర్టీసీ అద్దె బస్సులను సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు పరేడ్ మైదానంలో లాంఛనంగా ప్రారంభించనున్నారు.

### * భవిష్యత్తులో అద్దె బస్సులన్నీ మహిళా సమాఖ్యలవే: మంత్రి సీతక్క

తెలంగాణలో మహిళల ఆర్థిక సాధికారతకు మండల మహిళా సమాఖ్యల ద్వారా బస్సులు కొని ఆర్టీసీకి అద్దెకివ్వాలనే నిర్ణయించాం. మొదటి విడతలో 150 బస్సులను ఆర్టీసీకి అప్పగిస్తాయి. దీనికిగాను ఆర్టీసీ ప్రతి నెలా రూ.77,220 అద్దె చెల్లిస్తుంది. భవిష్యత్తులో అన్ని ఆర్టీసీ అద్దె బస్సులు మహిళా సమాఖ్యలకే కేటాయించేలా విధివిధానాలు రూపొందిస్తున్నాం.

# ప్రభుత్వ పాఠశాలల్లో ‘యాక్టివ్ ఆంధ్ర’

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను క్రీడల్లోనూ తీర్చిదిద్దాలని విద్యాశాఖ దృష్టిసారించింది. పిల్లల్లోని ప్రతిభను వెలికి తీసేందుకు ‘యాక్టివ్ ఆంధ్ర’ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అమలు చేయబోతోంది. ఆడటం వల్ల విద్యార్థుల మానసిక వికాసంతోపాటు గెలుపోటములను సమానంగా తీసుకునే స్ఫూర్తి అలవడి, ఆత్మవిశ్వాసం పెరుగుతుందని భావిస్తోంది. ఇందుకు దిల్లీ పాఠశాలల్లో అమలు చేసిన నమూనాపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. వేసవి సెలవుల వరకు ప్రయోగాత్మకంగా మంగళగిరి నియోజకవర్గంలోని నిడమర్రు పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు.

### ఎలా చేస్తారంటే..

* బడుల్లో విద్యార్థులను 58, 914, 1519 ఏళ్లుగా విభజిస్తారు. ః వారికి ఆసక్తి ఉన్న ఆటలను రోజుకో గంట చొప్పున ఆడిస్తారు.
* బడుల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుల్‌బాల్ వంటి క్రీడల కోసం మల్టీ కోర్టులు ఏర్పాటు చేస్తారు.
* పరుగు పందెం, ఇతర క్రీడల కోసం ట్రాక్‌లు నిర్మిస్తారు.
* వ్యాయామ ఉపాధ్యాయులకూ ప్రత్యేక శిక్షణ ఇస్తారు.
* ఈ ఫలితాలను పరిశీలించి, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని విద్యాశాఖ భావిస్తోంది.

నాలుగైదు పాఠశాలలకు ఓ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని చూస్తున్నారు. పాఠశాలల్లో రాణించిన వారిని ఈ కేంద్రంలో నిర్వహించే ప్రత్యేక శిబిరాలకు పంపి అక్కడ మెరికల్లా తీర్చిదిద్దాలని భావిస్తున్నారు. చిన్నప్పటి నుంచే ప్రోత్సహిస్తే రాణించే అవకాశం ఉంటుందని.. ప్రాథమిక బడుల్లోని విద్యార్థులపై ఎక్కువ దృష్టిపెడుతున్నారు. వీరికి పదేళ్లపాటు శిక్షణ ఇచ్చిన జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేస్తారు. జూనియర్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలోనూ క్రీడలు నిర్వహించాలనే ప్రణాళికను రూపొందించారు.

### ఎంతో పక్కాగా...

* మొదట ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో ప్రతిభ అన్వేషణ జరుగుతుంది.
* ఏ విద్యార్థికి ఏ క్రీడల్లో ఉత్సాహం ఉంది. ఎందులో ప్రతిభ చూపుతున్నాడో గుర్తిస్తారు.
* అలాంటి వారికి చదువుతోపాటే ప్రత్యేక శిక్షణ ఇస్తారు.
* పాఠశాలల్లో స్పోర్ట్స్ కరిక్యులమ్‌ను రూపొందిస్తారు.
* ఇందుకోసం విద్యాశాఖ ‘స్వీక్యోయియా ఫిట్నెస్ అండ్ స్పోర్ట్స్ టెక్నాలజీ’ సంస్థతో కలిసి పని చేస్తుంది.

# రూ.1,891 కోట్ల బకాయిలు చెల్లించండి

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. తెలంగాణకు గతంలో నాలుగు వేల మెగావాట్లకు అనుమతులు ఇచ్చిన కేంద్రం తర్వాత దాన్ని వెయ్యి మెగావాట్లకు కుదించిందని సీఎం ఆయనకు తెలిపారు. రాష్ట్రంలో మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుదుత్పత్తిని ప్రోత్సహిస్తున్నామని, అందువల్ల ఈ 4 వేల మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తికి అనుమతులను పునరుద్ధరించాలని కోరారు. ముఖ్యమంత్రి వినతులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమావేశానంతరం విలేకరులకు తెలిపారు. సమావేశంలో ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శి మాణిక్‌రాజ్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ సంక్షేమ పథకాలు

(మొదటిపేజీ తరువాయి)



తప్పుచేసినా చట్టం తన పని తాను చేసుకుపోతుందన్నారు. ఉమ్మడి కృష్ణా గుంటూరు, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయం సందర్భంగా మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయంలో కోలాహలంగా నిర్వహించిన విజయోత్సవ సభలో చంద్రబాబు ఉత్సాహంగా మాట్లాడారు. ‘‘కూటమి పార్టీల్లోని ఒకరిద్దరు నాయకులు వైకాపా వాళ్లకు పనులు చేస్తున్నారని నాకు అక్కడక్కడ ఫిర్యాదులు వచ్చాయి. ఎన్డీయే నాయకుల కోసమే పనిచేయాలని స్పష్టంగా చెప్పాను. ట్రస్ట్‌బోర్డులు, కార్పొరేషన్లలో ఎవరు ఉండాలన్నది ఎన్డీయే నాయకత్వమే నిర్ణయిస్తుంది. కూటమి నాయకులకే వాటిలో చోటుంటుంది’’ అని ఆయన స్పష్టం చేశారు. ‘‘నేను ఈ మాట చెబితే వైకాపా నాయకులు గింజుకుంటున్నారు. లంచాలిచ్చి అవినీతి పనులు చేసుకోవాలని చూస్తున్నారు. ఖబడ్దార్.. జాగ్రత్తగా ఉండండి. మీ ఆటలు సాగనివ్వను. సంక్షేమ కార్యక్రమాలు అర్హులందరికీ ఇస్తాం. అలాగని దబాయిస్తే... అది పగటి కలగానే మారుతుంది’’ అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించిన పేరాబత్తుల రాజశేఖరం, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లను, వారి విజయానికి కృషిచేసిన కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ‘‘మీతో కలిసి విజయోత్సవంలో పాల్గొనడంతో నాకు కొత్త జోష్, ఎనర్జీ వస్తున్నాయి. రాబోయే రోజుల్లో మనం ఇలాంటి విజయోత్సవాలు మరిన్ని చేసుకోవాలి. ఎన్ని ఎన్నికల్లో, ఎంత ఎక్కువ మెజారిటీతో గెలిస్తే ప్రభుత్వం అంత సుస్థిరంగా ఉంటుంది’’ అని పేర్కొన్నారు.

### ట్టభద్రులు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాం - ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థుల ఘన విజయంతో ప్రభుత్వంపై ప్రజలు ఎంత నమ్మకం పెట్టుకున్నారో అర్థమయిందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖర్‌కు మంగళవారం ఓ ప్రకటనలో అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థికవ్యవస్థతో పాటు యువత ఆకాంక్షలనూ ఛిన్నాభిన్నం చేసిందని పవన్ మండిపడ్డారు. అనుభవంతో కూడిన దార్శనిక పాలనతో ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని పరిస్థితులనూ చక్కదిద్దుకుంటూ వస్తున్నారని కొనియాడారు. ప్రధాని మోదీ రాష్ట్ర అభివృద్ధి కోసం ఇతోధికంగా సహకరిస్తున్నారని తెలిపారు. ఎన్డీయే ప్రభుత్వంపై పట్టభద్రులు, మేధావులు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

### ఈ ఐకమత్యం శాశ్వతంగా ఉండాలి

రాష్ట్రంలో తెదేపా, జనసేన, భాజపాల మధ్య ఐకమత్యం శాశ్వతంగా ఉండాలని, మూడు పార్టీల నాయకులు ఒకరినొకరు గౌరవించుకుంటూ ముందుకు సాగితే భవిష్యత్తులో ఇంకే పార్టీకీ అవకాశముండదని, ఎప్పుడూ ఎన్డీయేనే గెలుస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లాగే... ఏ ఎన్నికలు వచ్చినా మూడు పార్టీలూ కలిసి పనిచేస్తే తిరుగు ఉండదన్నారు. పవన్‌కల్యాణ్ పిలుపు ఇస్తే... జనసైనికులు నూటికి నూరుశాతం కూటమి అభ్యర్థుల విజయానికి కృషిచేశారని, అలాగే భాజపా కార్యకర్తలూ పూర్తి సహకారం అందించారని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో తెనాలి టికెట్ నాదెండ్ల మనోహర్‌కి ఇవ్వాల్సి ఉన్నందున... ఈసారి త్యాగం చేయాలని చెబితే ఆలపాటి రాజా మరో మాట లేకుండా సహకరించారని చంద్రబాబు పేర్కొన్నారు. దానికి బదులుగా మనోహర్... ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెనాలి నియోజకవర్గంతో పాటు, రెండు ఎమ్మెల్సీ స్థానాల పరిధిలోనూ అభ్యర్థుల విజయానికి చాలా కష్టపడి పనిచేసి మాట నిలబెట్టుకున్నారని ప్రశంసించారు. ‘‘పార్టీ తీసుకున్న నిర్ణయాన్ని నాయకులు గౌరవిస్తే వారికి సముచిత స్థానం కల్పించే బాధ్యత పార్టీలు తీసుకుంటాయి’’ అని ఆయన పేర్కొన్నారు.

# లిథియం స్వయం సమృద్ధి దిశగా భారత్

(మొదటిపేజీ తరువాయి)

లతో మాట్లాడుతూ ‘‘సోలార్ ప్యానెళ్లు, మొబైళ్ల బ్యాటరీలు తయారు చేయడానికి మనకు లిథియం అవసరం. మరో మూడు నాలుగేళ్లలో ఈ డిమాండ్‌ను మనమే భర్తీ చేసుకునే స్థాయికి చేరుతామని ఆశిస్తున్నాను’’ అని ఆయన అన్నారు. జాతీయ కీలక ఖనిజాల మిషన్ కోసం రూ.32,000 కోట్లు కేటాయించేందుకు అనుమతి మంజూరైందని మంత్రి వెల్లడించారు. జాతీయ కీలక ఖనిజ మిషన్ లక్ష్యాలను సాధించడంలో జీఎస్ఐ ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. ‘‘లాటిన్ అమెరికాలోని అర్జెంటీనాతో కలిసి ఐదు లిథియం బ్లాకుల్లో జీఎస్ఐ పనిచేస్తోంది’’ అని కిషన్‌రెడ్డి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా కీలక ఖనిజాల కోసం డిమాండు పెరుగుతోంది. జాతీయ కీలక ఖనిజాల మిషన్ ఈ ఖనిజాల కోసం దిగుమతులపై ఆధారపడాల్సిన అగత్యాన్ని నిర్మూలించే దిశగా పనిచేస్తుంది అని ఆయన అన్నారు. జీఎస్ఐ సాధించిన పలు విజయాలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. జియోలాజికల్ మ్యాపింగ్ జరిపిన దేశం ప్రపంచంలో భారత్ ఒక్కటేనని జీఎస్ఐ డైరెక్టర్ జనరల్ అసిత్ సాహా అన్నారు.

# పాఠాలు చెప్పిన ప్రథమ పౌరురాలు

(మొదటిపేజీ తరువాయి)

మరోమారు ఆ పాత్రను పోషించారు. ప్రెసిడెంట్ ఎస్టేటులోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయ పాఠశాలకు వెళ్లి తొమ్మిదో తరగతి విద్యార్థులకు పాఠాలు బోధించారు. తొలుత విద్యార్థుల పేర్లు ఆరా తీసిన రాష్ట్రపతి వారి అభిరుచులు, లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూమి వేడెక్కటం.. పర్యావరణ ప్రాధాన్యం, నీటి సంరక్షణ అంశాలను బోధించారు. పర్యావరణ మార్పుల ప్రభావం మనపై పడకుండా ఉండాలంటే వీలైనంత ఎక్కువగా మొక్కలు నాటాలని విద్యార్థులను ప్రోత్సహించారు. ప్రధాని మోదీ పిలుపునిచ్చిన ‘ఏక్ పేడ్ మాకే నామ్’ (అమ్మ పేరుతో ఒక మొక్క) గురించీ ప్రస్తావించారు. ప్రతి విద్యార్థి తమ పుట్టినరోజున ఓ మొక్క నాటాలని రాష్ట్రపతి సూచించారు.

# సిఈపీటి విశ్వవిద్యాలయంలో టెక్నాలజీ ఫ్యాకల్టీ 2025 యూజీ, పిజి ప్రోగ్రామ్‌లకు దరఖాస్తులను ఆహ్వానం

న్యూఢిల్లీ, ప్రజాస్ఫూర్తి : 1982లో స్థాపించబడిన సిఈపీటి విశ్వవిద్యాలయంలోని టెక్నాలజీ ఫ్యాకల్టీ గతంలో స్కూల్ ఆఫ్ బిల్డింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ పిలువబడేదని, 2025 కోసం దాని యుజి, పీజీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. సివిల్ ఇంజనీరింగ్, బిల్డింగ్ ఎనర్జీ పెర్ఫార్మెన్స్, జియోమాటిక్స్, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ డిజైన్, కన్స్ట్రక్షన్ ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ వంటి ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న రంగాల అవసరాలపై దృష్టి సారించి, ఎఫ్టీ వారి సమస్య పరిష్కారం, ఫలితాల ఆధారిత బోధనకు ప్రసిద్ధి చెందిన ప్రత్యేకమైన ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌లను అందిస్తుంది. స్టూడియో ఆధారిత ప్రాజెక్టుల ద్వారా ఆచరణాత్మక అభ్యాసంపై బలమైన ప్రాధాన్యతతో కలిపిన ఈ విధానం,వేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణ మౌలిక సదుపాయాలు, నిర్మిత పర్యావరణ రంగాలలో పరిశ్రమ నాయకులు ఎక్కువగా కోరుకునే నైపుణ్యాలు జ్ఞానాన్ని గ్రాడ్యుయేట్లకు అందిస్తుందని పేర్కొంది.

# తెలంగాణ జన సమితి కార్మిక విభాగం గ్రేటర్ హైదరాబాద్ సానిటరీ శాఖ ఇన్చార్జిగా ఆకుల పద్మ



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ జన సమితి కార్మిక విభాగం గ్రేటర్ హైదరాబాద్ సానిటరీ శాఖ ఇన్చార్జిగా కూకట్ పల్లి కి చెందిన ఆకుల పద్మ నియమితులయ్యారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని మంగళవారం మేడ్చల్ మల్కాజ్గిరి లొ తెలంగాణ జన సమితి వ్యవస్థాపకులు కోదండరాం సార్, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ చేతుల మీదుగా ఆకుల పద్మ అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో గ్రేటర్ పరిధిలోని కార్మిక విభాగం సానిటరీ శాఖ ఇన్చార్జిగా నియమించిన తెలంగాణ జన సమితి వ్యవస్థాప కులు కోదండరాం సార్ కు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. గ్రేటర్ పరిధిలోని కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ పరిష్కారం కోసం పాటుపడతానన్నారు. అనంతరం కోదండరాం సార్ తో పాటుగా ఆకుల శ్రీనివాస్, పల్లె వినయ్ కుమార్ లను పద్మ శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియజేశారు

# వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ "ఉమెన్ ఆఫ్ ది 2025 పురస్కారం ఎంపిక "



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రముఖ సాహిత్యవేత్త, సీనియర్ ప్రొఫెసర్, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ కి ఈ ఏడాది రాష్ట్రం నుంచి ఒక్కరికే ఇచ్చే అవార్డు "ఉమెన్ ఆఫ్ ది ఇయర్ 2025 "ఉత్తమ మహిళా పురస్కారానికి ఎంపిక చేసినట్లు తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ మంగళవారం ఓ పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా హైకోర్టు మాజీ న్యాయమూర్తి అడ్జస్ట్రేషన్ ట్రిబ్యునల్ కోర్టు ఛైర్మన్ జస్టిస్ వామన్ రావు దేశ్ పాండే, అమెరికా దేశ చికాగో స్టేట్ ,అమీర్ గ్లోబల్ పీస్ ఫౌండేషన్ చైర్మన్ ఫరూక్ అలీ ఖాన్,హైకోర్టు ప్రముఖ న్యాయవాది , ఇట్టా ఉదయశ్రీ తదితరులు పాల్గొని ఈనెల 7వ తేదీన యూనివర్సిటీలో ఈ అవార్డును ప్రదానం చేస్తారని తెలిపారు. ప్రొఫెసర్ సూర్యాధనంజయ్ ప్రముఖ విద్యావేత్త, ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు శాఖ అధిపతిగా, ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ గా మరెన్నో పదవులను అలంకరించడమే కాకుండా బాధ్యతగా నిర్వర్తించారు. ప్రస్తుతం వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం హైదరాబాద్ వైస్ ఛాన్సలర్ గా పనిచేస్తున్నారు.ఆమె ప్రముఖ సృజనాత్మక రచయిత్రి, విద్యా ,సాహిత్య రంగాలలో ఆమె సాధించిన నైపుణ్యం ఎందరికో స్ఫూర్తిదాయకం, ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు శాఖలో ప్రొఫెసర్ గా నియమితులైన మొదటి గిరిజన మహిళ అని అన్నారు. వీరనారి చాకలి అయిలమ్మ మహిళ విశ్వవిద్యాలయానికి తొలి వైస్ ఛాన్సలర్ గా చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ నాయకుల సమిక్ష సమావేశం



మేడ్చల్ , (ప్రజాస్ఫూర్తి) : మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకుల సమిక్ష సమావేశంలో మంగళవారం నిర్వహించారు.ఈ సమావేశంలో మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి శ్రీధర్ బాబు, మల్కాజ్గిరి పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మధు యాష్కి గౌడ్ పాల్గొని పార్టీ బలోపేతం గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మనువాదం, కార్పోరేట్ ఆర్థిక విధానాల లక్ష్యం శ్రమదోపిడియే




ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సదస్సు లో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మ శ్రీ మనువాదం , కార్పొరేట్ ఆర్థిక విధానాల లక్ష్యం శ్రమదోపిడీనిసాగించటమే అని అటువంటి విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక మహిళ సంఘటితంగా పోరాటాలు చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి పద్మశ్రీ పిలుపునిచ్చారు సిఐటియు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మార్చి 8 అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ మనువాదసిద్ధాంతం మహిళలను మనుషులుగావకూడ గౌరవించే స్థితిలేదని అన్నారు.మాహిళల స్వేచ్ఛ సమానత్వం,ఆర్థిక స్వావలంబనకు మనువాద సిద్ధాంతం వ్యతిరేకమైనదని అన్నారు.పెట్టుబడిదారీ కార్పోరేట్ అనుకూల ఆర్థిక విధానాలు సాగిస్తున్న శ్రమదోపిడిని సమర్థించటమే మనువాద సిద్ధాంతం కర్తవ్యంగా వుందన్నారు. ఉత్పత్తి పక్రియలో మహిళల శ్రమ కీలంగా వున్నప్పటికి అభివృద్ధిఫలాలు మాత్రం మహిళలలకు దక్కడం లేదన్నారు.ఆధునిక సమాజంలో సైతం మహిళలకు హక్కులు నిరాకరించబడుతున్నాయని అన్నారు. సమాజంలో అత్యంత ఎక్కువ దోపిడికి గురిఅవుతున్నది మహిళలే అన్నారు. పనికేంద్రాలలో భద్రత లేదని,చేస్తున్న పనికి భద్రతలేదనిఅన్నారు. మహిళ ప్రతిరోజు 5 గంటలశ్రమను కుటుం నిర్వహణ,పిల్లలు,కుటుంబసభ్ యుల సంరక్షణకేసం ఖర్చు చేస్తున్నదని ఈశ్రమఎక్కడా లెక్కలోకి రావటేదని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల కోట్లరూపాయల విలువ గలిగిన మహిళల శ్రమకు గుర్తింపు లేదని విమర్శించారు. అత్యంత తక్కువ వేతనాలతో కోట్లాదిమందిశ్రామిక మహిళలు పనిచేస్తున్నారని అన్నారు.వేతన బద్రత చట్టబద్ధమైన హక్కులు,కనీసవేతనం 26000/ తదితరల డిమాండ్ల కోసం పోరాటలను ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. పోరాటాల ద్వార సాధించుకున్న హక్కులనుసైతం పాలకవర్గాలు నాశనం చేస్తున్నాయని అన్నారు. సమరశీల శ్రామిక మహిళల పోరానికి మార్చి 8ప్రతీక అన్నారు.మార్చి 6నుండి 8వరకు మండల,గ్రామస్థాయివరకు అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా సభలు సమావేశాలు ర్యాలీలు మానవహారాలు వంటి కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని సిఐటియు జిల్లా కోశాధికారి జి పద్మ పిలుపు నిచ్చారు ఈ సదస్సులో సిఐటియు జిల్లా అధ్యక్షులు కే బ్రహ్మాచారి ,జిల్లా కార్యదర్శి ఏజే రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకటమ్మ ,సహాయ కార్యదర్శి కే సత్య ,జిల్లా కమిటీ సభ్యులు సుల్తానా ,దుర్గమ్మ ,భూక్య రమేష్, హేమలత, నాయకులు రాధా, జయసుధ, రోజా ,భాను ,నిరోషా తదితరులు పాల్గొన్నారు.

# చదువు ఉంటే బంగారు భవిష్యత్తు

* **రాంనగర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా వీడ్కోలు సభ సన్మాన కార్యక్రమం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి ..ఇక్కడే కలిసాము చదువులమ్మ చెట్టు నీడలో.. వీడలేమంటు వీడుకోలంటు వెళ్ళిపోతున్నాం అంటూ రాంనగర్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. చదువు ఉంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని గురువులను తల్లిదండ్రులను గౌరవించాలని రాంనగర్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సీతతో పాటు ఉపాధ్యాయురాళ్లు పద్మజ వెంకటరమణలు పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండల పరిధిలో ఉన్న రాంనగర్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినిలు మహిళా టీచర్లను ఘనంగా సన్మానించడం జరిగింది. అనంతరం జరిగిన కార్యక్రమంలో టీచర్లు మాట్లాడుతూ గురువులు చెప్పిన పాఠాలను శ్రద్ధగా వింటూ పరీక్షల్లో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ ముఖ్యమని తెలిపారు. బాల్యం దశలో ఉన్న విద్యార్థినిలు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ పుస్తకాలకు దగ్గర కావాలని తెలిపారు. ఖాళీ సమయంలో సమయాన్ని వృధా చేయకుండా చదువుల పైనే దృష్టి పెట్టాలని చెప్పారు. మొదటి దశలోనే పునాది గట్టిగా ఉంటే భవిష్యత్తులో చదువుల్లో సులువుగా రాణించే అవకాశం ఉంటుందని తెలిపారు. తల్లిదండ్రుల సూచనలకు గౌరవించి వారి అడుగుజాడల్లో నడిచి బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థినిలకు పిలుపునిచ్చారు. కార్యక్రమానికి ముందుగా విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: వివిధ అవసరాల కోసం తాసిల్దార్ కార్యాలయానికి వచ్చే సందర్శకులకు వేసవి తాపం నుంచి సేద తీరెందుకుగాను మణుగూరు తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. మంగళవారం మణుగూరు పర్యటనలో భాగంగా మణుగూరు తాసిల్దారు కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన చలివేంద్రమును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో వడగాలలో తీవ్రత అధికంగా ఉంటుందని, వృద్ధులు మరియు పిల్లలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మణుగూరు తాసిల్దార్ , కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళా న్యాయవాదుల సదస్సును జయప్రదం చేయాలి

**- మామిడి వెంకట్ రెడ్డి**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా న్యాయవాదుల సబ్ కమిటీ ఐలు ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన హైదరాబాద్ లో నిర్వహించ తలపెట్టిన మహిళా హక్కులపై సదస్సును జయప్రదం చేయాలని ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం వలిగొండ రోడ్డు లోని చౌటుప్పల్ బార్ అసోసియేషన్ హాల్ లో సదస్సు వాల్ పోస్టర్లను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఊడుగు శ్రీనివాస్, న్యాయవాదులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ చట్టపరంగా మహిళలకి ఉన్న హక్కులను సమీక్షించి మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చట్ట సవరణలు చేయాలన్నారు. 2019 తర్వాత తెలంగాణ బార్ కౌన్సిల్ లో నమోదు చేసుకున్న మహిళా న్యాయవాదులు అందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని, హెల్త్ కార్డుల్లో వెటర్నరీ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా హైకోర్టు జస్టిస్ రాధా రాణి, జస్టిస్ రజిని, ఐలు నేషనల్ వైస్ ప్రెసిడెంట్ చంకీ రాజ్, రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ శైలజలు హాజరవుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళా న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ బార్ ఆసోసియేషన్ ఉపాధ్యక్షుడు తాడూరు పరమేష్, సహాయ కార్యదర్శి జిల్లా రమేష్, ఐలూ జిల్లా కమిటీ ఎండి ఖయ్యూం, మహిళా న్యాయవాదులు స్వాతి, వనజ, శ్రీశైలం, జంగయ్య, శంకర రాఘవేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గర్భనిర్ధారణ పద్ధతుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చట్ట నిబంధనలను పాటించాలి

* **మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి**



మేడ్చల్ ప్రతినిధి, (ప్రజాస్ఫూర్తి) : గర్భనిర్ధారణ పద్ధతుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు చట్ట నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సి. ఉమా గౌరి అన్నారు. పీసీపీఎండీటీ చట్టం అమలు పర్యవేక్షణలో భాగంగా వాయుపురి లోని ప్యూర్ ఆర్థో ఆసుపత్రి , శ్రీ రక్షా ఆసుపత్రిని అందులోని స్కాన్ యంత్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డా. ఉమా గౌరి నమోదిత ధృవపత్రాలు , ఫార్మ్ ఎఫ్ నమోదు (ఆన్‌లైన్ , ఆఫ్‌లైన్ సమర్పణలు) సహా పీసీపీఎండీటీ చట్ట నిబంధనలకు అనుగుణంగా నిర్వహణ జరుగుతున్నదాని పరిశీలించారు. అనంతరం అవసరమైన రికార్డులు, ప్రదర్శనా పట్టికలు, అనుమతి పత్రాలు పరిశీలించడంతో పాటు, సంబంధిత రేడియాలజిస్టు సంతకంతో ఫార్మ్ ఎఫ్ ఉండేలా నిర్ధారించారు. పీసీపీఎండీటీ చట్టం ప్రకారం అన్ని అవసరమైన పత్రాలను కనీసం రెండు సంవత్సరాలు భద్రపరచడం తప్పనిసరి అని తెలిపారు.

# ముస్తాబాద్ బిజెపి శ్రేణుల సంబురాలు



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమరయ్య ఘన విజయం సాధించడం పట్ల ముస్తాబాద్ మండల కేంద్రంలో బిజెపి శ్రేణులు మంగళవారం సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం బిజెపి మండల అధ్యక్షుడు మేరుగు అంజా గౌడ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వస్తుందనడానికి ఈ ఫలితాలు నిదర్శనమని అన్నారు. ఈ విజయానికి సహకరించిన టీచర్ ఎమ్మెల్సీ ఓటర్లకు, విజయానికి కృషిచేసిన బిజెపి కార్యకర్తలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మల్లారపు సంతోష్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మీస సంజీవ్ మండల ప్రధాన కార్యదర్శి బాద నరేష్, నాయకులు చీట్నేని శ్రీనివాసరావు, మహేందర్, గూడ బాల్ రెడ్డి, ఎదునూరి గోపికృష్ణ, పప్పుల శ్రీకాంత్, సత్తయ్య, ఓరగంటి సత్యం, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్, రఘుపతి, పీరల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడంపై హైకోర్టులో పిటిషన్!

హైదరాబాద్: భారాస అధినేత, ఎమ్మెల్యే కేసీఆర్ అసెంబ్లీకి రావట్లేదంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. విజయ్‌పాల్‌రెడ్డి వేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యంపై కోర్టులో విచారణ జరిగింది. ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్.. అసెంబ్లీ వేదికగా ప్రజా సమస్యలను లేవనెత్తాల్సిన బాధ్యత ఆయనపై ఉందని పిటిషనర్ తరపు



న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని నెలలుగా ఆయన అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనడం లేదని, ఇలా సమావేశాలకు హాజరు కాకుంటే చట్టప్రకారం అనర్హుడిగా ప్రకటించవచ్చన్నారు. ఈ మేరకు అసెంబ్లీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేయాలని ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. కాగా.. ఈ వ్యాజ్యంలో జోక్యం చేసుకోవడానికి కోర్టు పరిధి ఏంటని ధర్మాసనం ప్రశ్నించింది. ఈ పిల్‌కు అర్హత లేదని శాసనసభ వ్యవహారాల తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అయితే, కోర్టులు జోక్యం చేసుకోవచ్చని.. ఈ మేరకు వాదనలు వినిపించడానికి గడువు కావాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరడంతో.. విచారణను కోర్టు 2 వారాలకు వాయిదా వేసింది.



## ఇసుక వ్యాపారుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కు వినతి

కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కూకట్ పల్లి నియోజకవర్గం పరిధిలోని పర్వతనగర్ తదితర ప్రాంతాల్లో ఇసుక వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారులు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ని క్యాంపు కార్యాలయంలో కలిసి వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేక సంవత్సరాలుగా తాము ఇసుక వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఏ నాడు కూడా ఎవరూ కూడా మమ్మల్ని ఇబ్బంది పెట్టలేదని ఇటీవల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించిందని పోలీసులు రెవెన్యూ అధికారులు వచ్చి మా వాహనాలను ఇసుక కుప్పలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు ఫైన్ విధిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఇసుక వ్యాపారుల ఆవేదనను అర్థం చేసుకున్న ఏమ్మెల్యే వెంటనే జిల్లా కలెక్టర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ లకు లేక రాసి కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టొద్దన్నారు. ప్రభుత్వ ఆదేశాలపై ముందుగా ప్రజలకు చిరు వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్వయం ఉపాధితో బ్రతుకుతున్న ప్రజలను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మూసీ పునరుజ్జీవం.. చర్చల ద్వారానే ప్రభుత్వం ముందుకెళ్లాలి

**: మేధా పాట్కర్**

హైదరాబాద్: ప్రముఖ సామాజిక, పర్యావరణ వేత్త మేధా పాట్కర్ హైదరాబాద్‌లో పర్యటించారు. మూసీ పునరుజ్జీవంలో భాగంగా ఇళ్లు కోల్పోయిన వారిని పరామర్శించారు. బీఆర్‌కే భవన్‌లో వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు కేవీఎస్ రెడ్డి, భవానీ రెడ్డి, గంగాధర్ తదితరులతో మేధా పాట్కర్ సమావేశమయ్యారు. రెండ్రోజులుగా నగరంలో తన పర్యటన, మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు వల్ల ఇళ్లు కోల్పోయిన వారి సమస్యలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న రైతుల గురించి కమిషన్‌తో చర్చించారు. మూసీ రివర్ ప్రాజెక్టులో ఇళ్లు కోల్పోయిన వారికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇతర భూములు, వ్యవసాయ



భూములు కోల్పోయిన వారికీ ఆర్థిక సాయం, భూమికి బదులు మరోచోట భూములు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వివరించారు. ఫోర్త్ సిటీ విషయంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. మూసీ నది పూర్వ వైభవం తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం... పరివాహక ప్రాంత ప్రజలతో చర్చల ద్వారా ముందుకెళ్లాలని, పేదలకు పునరావాసం కల్పించడంలో జాగ్రత్తలు పాటించాలని ఈ సమావేశంలో మేధా పాట్కర్ కొన్ని సూచనలు చేశారు.

## ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం.. సహాయక చర్యల్లో కీలక పురోగతి

దోమలపెంట: నాగర్ కర్నూల్ జిల్లాలోని శ్రీశైలం ఎడమ గట్టు కాలువ (ఎస్ఎల్‌బీసీ) సొరంగం వద్ద సహాయక చర్యల్లో కీలక ముందడుగు పడింది. ఇటీవల 14వ కిలోమీటరు వద్ద సొరంగం పైకప్పు ఒక్కసారిగా కూలిన ఘటనలో 8 మంది సిబ్బంది అందులో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన 11 రోజులకు టన్నెల్‌లోని కన్వేయర్ బెల్ట్‌ను సాంకేతిక సిబ్బంది పునరుద్ధరించారు. కన్వేయర్ బెల్ట్ పనిచేస్తుండటంతో బురద, మట్టి తొలగింపు పనులు వేగవంతం కానున్నాయి. 200 అడుగులు పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, సెగ్మెంట్, టీబీఎం శిథిలాలు



ఉండటంతో ఇప్పటి వరకు ఆ 8మంది జాడ గుర్తించలేకపోయారు. దాదాపు 6 వేల క్యూబిక్ మీటర్ల పూడికను తొలగించాల్సి ఉందని అధికారులు అంచనా వేశారు.

## పోలీసు విధులకు ఆటంకపరిచిన 12 మందిపై కేసు

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: పోలీసు విధులకు ఆటంకపరిచిన 12 మందిపై కేసు నమోదు చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్తాబాద్‌కు చెందిన వల్లపు దేవరాజు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతి చెందగా, ఈ సందర్భంలో మృతదేహాన్ని ముస్తాబాద్ పీపుల్స్ ఆసుపత్రి వద్ద అంబులెన్స్‌లో ఉంచి అక్కడి నుండి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకకు ప్రయత్నించినా పోలీసులను అడ్డుకొని, పోలీసుల విధులకు ఆటంకపరిచి, రోడ్డుపై వాహనదారుల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన 12 మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఎలాంటి పరిస్థితిలోనైనా మృతదేహాన్ని తరలించే క్రమంలో అడ్డుకున్న, నష్టపరిహారం కోసం రోడ్డుపై ధర్నాలు, రాస్తారోకోలు చేసిన ఎంతటి వారిపైన అయిన చట్టరిత్యా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## ఈ నెల 6న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్: ఈ నెల 6న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. మధ్యాహ్నం 2 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశం కానుంది. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ తదితర అంశాలపై నిర్ణయాలు తీసుకోనున్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీకి వెళ్లి ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. పలు ప్రాజెక్టులపై చర్చించారు. వాటిపై కూడా కేబినెట్‌లో చర్చ జరిగే అవకాశముంది.



## దక్షిణాదిలో ఒక్క పార్లమెంటు సీటు కూడా తగ్గదు.. అని మోదీ చెప్పారు

**: ఎంపీ లక్ష్మణ్**

హైదరాబాద్: దక్షిణాదిలో ఒక్క పార్లమెంట్ సీటు కూడా తగ్గదని ప్రధాని మోదీ చెప్పారని భాజపా రాజ్యసభ సభ్యుడు కె.లక్ష్మణ్ తెలిపారు. జనగణన చేసిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ ఖరారు చేస్తారని వెల్లడించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఎంపీ లక్ష్మణ్ మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. “ 2011తో పోలిస్తే రెండు తెలుగు రాష్ట్రాల్లో జనాభా తగ్గింది. జనాభా తగ్గినప్పటికీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పార్లమెంట్ సీట్లు తగ్గవు. ఏపీ పునర్ వ్యవస్థీకరణ చట్టంలో 153 సీట్లు తెలంగాణలో పెంచాలని పెట్టారు. దక్షిణాది వ్యక్తికి జాతీయ అధ్యక్ష పదవి అని ఎక్కడా చర్చలేదు. 11 రాష్ట్రాల అధ్యక్షులను ప్రకటించాం.. త్వరలోనే అన్ని రాష్ట్రాలకు ప్రకటిస్తాం. డీపీఆర్ సర్వే సక్రమంగా చేయకపోతే ట్రిపుల్ ఆర్ వెనుకకు వెళ్తుంది. భారాస చేసిన తప్పునే కాంగ్రెస్ చేస్తే ఎట్లా? బీసీల్లో 10శాతం ముస్లింలను కలపకపోతే ఆమోదిస్తాం. కులగణన తప్పుల తడకగా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డికి అవగాహన లేదు. భాజపా బలం పెరుగుతుందని రేవంత్‌రెడ్డికి భయం పట్టుకుంది. ఆయనే మిగతా నాలుగేళ్లు ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నాం. సీఎం మార్పు అనేది కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం. జమిలి ఎన్నికలపై చర్చ జరుగుతోంది.. ఇప్పటికే రెండు మూడు సమావేశాలు జరిగాయి. కుల గణన చేపట్టి రేవంత్ రెడ్డి ఏ ఒక్కరిని సంతృప్తి పరచలేదు” అని లక్ష్మణ్ అన్నారు.

## స్మోక్ బాంబులతో.. అట్టుడికిన సెర్బియా పార్లమెంటు!

ప్రతిపక్షాల నిరసనలతో సెర్బియా పార్లమెంటు అట్టుడికింది. స్మోక్ బాంబులు, మండే స్వభావం కలిగిన ఇతర వస్తువులు విసరడంతో రణరంగంగా మారింది. వీటితోపాటు కోడిగుడ్లు, వాటర్ బాటిళ్లనూ చట్టసభ సభ్యులు విసురుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలో ముగ్గురు ఎంపీలకు గాయాలు కాగా అందులో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. యూనివర్సిటీ విద్యకు నిధులు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుపై పార్లమెంటులో చర్చ జరిగింది. దీనిపై ఓటింగ్ సమయంలో పార్లమెంటులో తీవ్ర గందరగోళం ఏర్పడింది. దీంతోపాటు అనేక నిర్ణయాలను ఆమోదించే యోచనలో అధికార పార్టీ ఉందని ఆరోపిస్తూ ప్రతిపక్షాలు నిరసన చేపట్టాయి.



ఇది చట్టవిరుద్ధమని, ప్రధాని మిలోస్ వుచెవిక్ రాజీనామాను వెంటనే ఆమెదించాలని డిమాండ్ చేశారు. బ్యానర్లు చేతపట్టి, నినాదాలు చేస్తూ విపక్ష సభ్యులు నిరసనలకు దిగారు. ఈ క్రమంలో అధికార, విపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. స్మోక్ బాంబులు విసరడంతో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. కోడిగుడ్లు, నీళ్లబాటిళ్లు కూడా విసురుకున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఈ ఘర్షణల్లో ముగ్గురు ఎంపీలకు గాయాలయ్యాయని, ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని అధికారులు ప్రకటించారు. ఈ పరిణామాలపై తీవ్రంగా స్పందించిన స్పీకర్ అనా బ్రనాబిక్.. ప్రతిపక్షాలను ఉగ్రవాద ముఠాలుగా పేర్కొన్నారు. సెర్బియాలోని నోవీసాడ్ నగరంలో గత నవంబర్‌లో ఓ రైల్వేస్టేషన్ ముఖద్వారం పైకప్పు కూలి 15 మంది మరణించినప్పటి నుంచి విద్యార్థులు చేపట్టిన అవినీతి నిర్మూలన ఉద్యమం ఉధృత రూపు దాల్చింది. ఉద్యమ తీవ్రతకు తలొగ్గిన ప్రధానమంత్రి మిలోస్ వుచెవిచ్ ఇటీవల రాజీనామా చేసినప్పటికీ.. పార్లమెంటు దీన్ని ఆమోదించాల్సి ఉంది. 30 రోజుల్లో ఆమోదించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పరచడమా లేక మధ్యంతర ఎన్నికలు జరిపించడమా అన్నది తేల్చాల్సి ఉంది.

# 'నా వల్లే లాలూ రాజకీయాల్లో ఎదిగారు' : నీతీశ్

ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌పై బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసెంబ్లీలో తన ప్రసంగాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించిన అతనిపై సీఎం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. గతంలో బిహార్‌లో అభివృద్ధి ఏమీ జరగలేదని, తన హయాంలోనే జరిగిందన్నారు. ఈ సందర్భంగా తన వల్లే లాలూ ప్రసాద్ యాదవ్ రాజకీయాల్లో ఎదిగారని వ్యాఖ్యానించారు. "గతంలో బిహార్‌లో పరిస్థితి ఎలా ఉండేదో గుర్తుందా? సాయంత్రం అయ్యిందంటే ఎవ్వరూ బయటకు వచ్చేవారు కాదు. నీవు చిన్నపిల్లాడివి. వెళ్లి ప్రజలను అడుగు. మీ నాన్న ఈ స్థాయిలో ఉన్నాడంటే అది నా వల్లే. లాలూకు ఎందుకు అండగా నిలుస్తున్నారని మీ సొంత మనుషులే అడిగారు. అయినప్పటికీ.. మద్దతు ఇచ్చా' అని నీతీశ్ కుమార్ పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాల్లో భాగంగా అసెంబ్లీలో మాట్లాడిన తేజస్వీ యాదవ్.. రాష్ట్రంలో అభివృద్ధి గురించి మాట్లాడారు. ఆదాయం లేనప్పటికీ



బడ్జెట్ పెరుగుతూ పోతుండటంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను అబద్ధాల పుట్ట అని ఆరోపించారు. తన తండ్రి లాలూ ప్రసాద్ ప్రభుత్వ హయంలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వంలో మాత్రం అన్నీ తప్పుడు లెక్కలేనని విమర్శించారు. ముఖ్యమంత్రి నీతీశ్ అసెంబ్లీలో ప్రసంగిస్తున్న సమయంలో తేజస్వీ అడ్డుకునే ప్రయత్నం చేయగా.. తేజస్వీపై సీఎం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

# ఖర్గేతో డీకే భేటీ.. సీఎం మార్పు జరగనుందా?



బెంగళూరు: కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సీఎం పదవి స్వీకరిస్తారంటూ గత కొంత కాలంగా ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ఆయన కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కావడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో నాయకత్వ మార్పుపై ఊహగానాలు వెల్లువెత్తిన వేళ.. వీరిద్దరి భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది.

**అందుకే ఖర్గేను కలిశా..**

ఖర్గేతో తన సమావేశం ప్రోటోకాల్‌కు సంబంధించిన అంశమని శివకుమార్ తెలిపారు. "ఆయన మా పార్టీ అధ్యక్షుడు. మా నాయకుడు. ప్రోటోకాల్ ప్రకారం ఆయనను నేను రిసీవ్ చేసుకోవాల్సి ఉంది. అందుకే ఖర్గేను కలిశా. బెంగళూరులో పార్టీ కొత్త కార్యాలయం శంకుస్థాపన కోసం ఆయనను ఆహ్వానించాం. ఈ సందర్భంగా ఆయనతో ఎన్నో విషయాలపై చర్చించా'' అని డీకే వెల్లడించారు. కాగా.. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే బాధ్యతలు స్వీకరిస్తారంటూ చాలా రోజులుగా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. అందుకు ఆయన పార్టీ మారనున్నారంటూ వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ సీఎం వీరప్ప మొయిలీ కీలక వ్యాఖ్యలు చేశారు. డీకే సీఎం కావడం ఖాయమని.. దీన్ని ఎవరూ అడ్డుకోలేరని వ్యాఖ్యానించారు. ఆయన సీఎం పదవి చేపట్టడం అనేది కాలపరిమితితో కూడుకున్నదని, అయితే అది కచ్చితంగా జరుగుతుందన్నారు. వీరప్ప వ్యాఖ్యలపై స్పందించిన సహాయక మంత్రి కేఎన్ రాజన్న.. ఇది కేవలం మొయిలీ వ్యక్తిగత అభిప్రాయం మాత్రమేనని, దీనిపై అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు. ఇదే విషయంపై డీకే మాట్లాడారు. ఈ ప్రకటనలు ఆయన వ్యక్తిగతమని.. ఖర్గే నిర్ణయానికి తాను కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ.. వీరప్ప చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఇది జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే ఖర్గేతో డీకే భేటీ కావడంతో.. ఊహాగానాలు మరింత జోరందుకున్నాయి. త్వరలో ఆయన సీఎం పీఠంపై కూర్చోవడం ఖాయమంటూ ప్రచారం కొనసాగుతోంది.

## తల్లికి కడసారి నమస్కరించి పరీక్షకు వెళ్లిన విద్యార్థి.. హృదయాలను మెలిపెడుతోన్న ఘటన

కొద్దిగంటల్లో పరీక్షకు వెళ్తామనగా తల్లి చనిపోతే.. చేయిపట్టుకొని నడిపించిన అమ్మ కానరాని లోకాలకు వెళ్లిపోతే జీవితం పెట్టిన ఆ పరీక్ష ముందు ఆ పసిమనసు విలవిల్లాడింది. తండ్రి అండలేదు.. సోదరి భవిష్యత్తు కళ్లముందు ఉంది. అందుకే కాలం వేసిన శిక్షకు లొంగిపోవద్దనుకున్న ఆ పిల్లాడు.. అడుగులు ముందుకేశాడు. చివరిసారిగా అమ్మ పాదాలకు నమస్కరించి ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్లాడు. హృదయాలను మెలిపెట్టే ఈ ఘటన తమిళనాడులో చోటుచేసుకుంది. తమిళనాడులో మార్చి 3 నుంచి ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. తిరునల్వేలిలోని వల్లియూర్‌కు చెందిన సునీల్ కుమార్ కొద్దిగంటల్లో పరీక్షకు వెళ్తాడనగా.. గుండె సమస్యతో అతడి తల్లి ఆకస్మికంగా చనిపోయింది. ఆరు సంవత్సరాల క్రితమే తండ్రిని కోల్పోయాడు. ఆ తల్లే సునీల్, అతడి సోదరిని పెంచి పెద్ద చేసింది. వారికి ఆమే ఆధారం. ఇలాంటి సమయంలో తల్లిని కోల్పోయిన ఆ పిల్లాడు ఎంతో వేదనకు గురయ్యాడు. కానీ బంధువులు, చుట్టపక్కలవారి ప్రోత్సాహంతో బాధ దిగమింగుకొని పరీక్ష రాయడానికి వెళ్లాడు. వెళ్లేముందు



చివరిసారిగా తల్లిపాదాల వద్ద హాల్‌టికెట్ ఉంచి ఆశీస్సులు తీసుకున్నాడు. కానీ అప్పుడు తనను తాను నియంత్రించుకోలేక వెక్కివెక్కి ఏడ్చాడు. కానీ ఇతర సభ్యులు అతడిని ఓదార్చి, ఎగ్జామ్ సెంటర్ వద్ద దిగబెట్టారు. బాగా చదవాలని తల్లి కోరుకునేదని గుర్తుచేశారు. మరోవైపు సోదరి భవిష్యత్తు అతడి కళ్లముందు కదలాడింది. ఈ ఘటన తమిళనాడు ప్రభుత్వం దృష్టికి చేరింది. విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేశ్ బృందం సునీల్‌తో మాట్లాడింది. అవసరంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చింది. ఒక సోదరుడిలా తోడుగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ హృదయవిదారక ఘటనపై సీఎం ఎంకే స్టాలిన్ ఎక్స్ వేదికగా స్పందించారు.

# రాష్ట్రాల వైఫల్యం వల్లే ఔషధ ధరలు పెరిగాయి

**: సుప్రీంకోర్టు**

దిల్లీ: అందుబాటు ధరల్లో వైద్య సంరక్షణ, సదుపాయాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తంచేసింది. రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యమే ప్రైవేటు ఆస్పత్రులకు ప్రోత్సాహకంగా మారిందని వ్యాఖ్యానించింది. ప్రైవేటు ఆస్పత్రులన్నీ రోగులు, వారి బంధువులతో బలవంతంగా అధిక ధరలతో కూడిన మందులను కొనుగోలు చేయిస్తున్నాయని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై తాజాగా సుప్రీంలో విచారణ జరిగింది. తమ ఫార్మసీల నుంచే ఔషధాలు కొనుగోలు చేయాలని రోగులను బలవంతం చేయకుండా ప్రైవేటు ఆసుపత్రులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. నియంత్రణ చర్యలు తీసుకోవడంలో కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, దానివల్ల రోగులు దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. పిటిషనర్ వాదనతో సుప్రీం ధర్మాసనం ఏకీభవించింది. రోగులకు సూచించిన ఔషధం వేరే చోట తక్కువ ధరకు లభిస్తున్నప్పుడు, దానిని తమ ఫార్మసీలోనే



కొనుగోలు చేయాలని ప్రైవేటు ఆసుపత్రులు బలవంతం చేయకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. ముఖ్యంగా సమాజంలోని పేద వర్గాలకు ప్రాణాధార ఔషధాలు అందుబాటు ధరల్లో లభించడం కష్టమైపోయిందని వ్యాఖ్యానించింది. పౌరులు ఈ రకమైన దోపిడీకి గురికాకుండా రక్షించేందుకు తగిన మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఇదే విషయమై గతంలో సుప్రీంకోర్టు రాష్ట్రాలకు నోటీసులు ఇచ్చింది. వాటికి ఒడిశా, అరుణాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, బిహార్, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు స్పందించాయి. కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేశాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ధరల నియంత్రణ ఆదేశాలపైనే తాము ఆధారపడతామని పేర్కొన్నాయి. అత్యవసర ఔషధాలు అందుబాటు రేటులో లభ్యమయ్యేలా చూసేందుకు వాటి ధరలను నిర్ణయించినట్లు తెలిపాయి. ఆసుపత్రిలోని ఫార్మసీలోని మందులు కొనుగోలు చేయాలనే ఒత్తిడి ఏదీ లేదని కేంద్రం కోర్టుకు సమాధానమిచ్చింది.

## యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేటు రంగం

**: డిఫెన్స్ ప్యానెల్ క్లియరెన్స్**

భారత్‌లో యుద్ధ విమానాల తయారీలోకి ప్రైవేటు రంగం కూడా అడుగుపెట్టేందుకు మార్గం మరింత సుగమం అయింది. తాజాగా దీనికి సంబంధించి డిఫెన్స్ ఎంపవర్‌మెంట్ కమిటీ ఈ మేరకు పలు సూచనలు చేసింది. తేలికపాటి యుద్ధవిమానం తేజస్ ఉత్పత్తిని వేగవంతం చేసేందుకు ఐదుగురు సభ్యుల కమిటీని ఇటీవల నియమించిన విషయం తెలిసిందే. ఇది తాజాగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు నివేదిక సమర్పించింది. తాజాగా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు ఓ ఆంగ్ల పత్రికతో మాట్లాడుతూ.. రక్షణ మంత్రి ఈ సూచనల అమలును దశలవారీగా చేపట్టాని తెలిపారని పేర్కొన్నారు. వాయుసేన చీఫ్ అమర్ ప్రీత్ సింగ్ కొన్ని నెలల నుంచి భారత్‌లో తేజస్ ఉత్పత్తి, డెలివరీల్లో జాప్యంపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ఓ పక్క వాయుసేన ఆపరేషనల్ స్క్వాడ్రన్ల సంఖ్య పడిపోతుండటంపై కూడా ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కమిటీకి రక్షణశాఖ కార్యదర్శి రాజేశ్



కుమార్ సింగ్ అధ్యక్షతవహించారు. తాజాగా ఇది స్వల్పకాల, మధ్యకాల, దీర్ఘకాలంలో తీసుకోవాల్సిన చర్యలతో తేజస్ తయారీల్లోని సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. ముఖ్యంగా ప్రైవేటు రంగాన్ని భాగస్వామిని చేయడంతో ఈ సమస్యలను అధిగమించవచ్చని పేర్కొంది. వాయుసేన వచ్చే 20 ఏళ్లలో వివిధ వేరియంట్లకు చెందిన దాదాపు 350 తేజస్ విమానాలను వినియోగించాలని భావిస్తోంది. కానీ, అమెరికా నుంచి ఇంజిన్ల రాకలో జాప్యం, మందకొడి ఉత్పత్తి వంటి కారణాలతో ప్రణాళిక అమల్లో తీవ్ర జాప్యం చోటు చేసుకొంది.

# మహారాష్ట్ర మంత్రి ధనంజయ్ ముండే రాజీనామా

మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలో సర్పంచ్ దారుణ హత్య వ్యవహారం రాజకీయ ప్రకంపనలు రేపుతోంది. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ధనంజయ్ ముండే తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. సర్పంచ్ సంతోష్ దేశ్‌ముఖ్ హత్య కేసులో ఆయనపై ఆరోపణలు రావడంతో మంత్రి పదవికి రాజీనామా చేయాలని ధనంజయ్ ముండేను సీఎం దేవేంద్ర ఫడణవీస్ ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఆయన తన రాజీనామాను సమర్పించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఫడణవీస్ మాట్లాడుతూ ముండే రాజీనామాను తాను ఆమోదించి.. గవర్నర్ సీపీ రాధాకృష్ణన్‌కు పంపానని మీడియాకు తెలిపారు. ఎన్సీపీ అజిత్ పవార్ వర్గంలో కీలకనేత అయిన ధనంజయ్ ముండే సొంత జిల్లా బీడ్‌లో మసాజోగ్ గ్రామ సర్పంచి సంతోష్ దేశ్‌ముఖ్‌ను కిడ్నాప్ చేసి ఆ తర్వాత చిత్రహింసలకు గురి చేసి



చంపిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఈ హత్యోదంతానికి సంబంధించిన కేసులో మంత్రి సన్నిహితుడు వాల్మిక్ కరాడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దీంతో ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి రాజీనామా చేయాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. మరోవైపు, మంత్రి ధనంజయ్ ముండేకు గట్టి మద్దతు ఇస్తున్న ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు, మంత్రికి వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను తాను సమర్పించినట్లు సామాజిక కార్యకర్త అంజలి దమానియా పేర్కొనడంతో మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్లు మళ్లీ మొదలయ్యాయి. ఎన్సీపీ (శరద్ పవార్) కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుప్రియా సూలే సైతం ధనంజయ్ ముండే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఇటీవల ధనంజయ్ మాట్లాడుతూ.. తనను మంత్రి పదవికి రాజీనామా చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్ లేదా డిప్యూటీ సీఎం అజిత్ పవార్ చెప్తే వెంటనే రాజీనామా చేస్తానన్నారు.

## కశ్మీర్‌పై ఐరాస ప్రతినిధి వ్యాఖ్యలు.. తిప్పికొట్టిన భారత్

**ఐరాస** (UN) మానవ హక్కుల హైకమిషనర్ వోల్కర్ టర్క్ భారత్‌లోని మణిపుర్, కశ్మీర్ సమస్యలను ప్రస్తావిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. వీటిని భారత్ తరఫు ప్రతినిధి అరిందమ్ బాగ్చీ తిప్పికొట్టారు. తమపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని ఇప్పటికే నిరూపితమైందని స్పష్టంచేశారు. జెనీవాలో జరిగిన 58వ మానవ హక్కుల మండలిలో గ్లోబల్ అప్‌డేట్‌పై టర్క్ మాట్లాడారు. 'మణిపుర్‌లో హింస, శాంతిస్థాపన వంటి పలు సమస్యలు పరిష్కరించడానికి వేగవంతంగా చర్చలు జరపాలని కోరుతున్నా. కశ్మీర్‌తో సహా పలు ప్రాంతాల్లో మానవ హక్కుల పరిరక్షకులు, స్వతంత్ర జర్నలిస్టులపై నిర్బంధ చట్టాలు విధించడం, పౌరులు తిరిగే ప్రాంతాలను వినియోగించుకోకుండా ఆంక్షలు పెట్టడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నా. భారత దేశానికి ప్రజాస్వామ్యం, సంస్థలు అతిపెద్ద బలం. అవి ఆ దేశ అభివృద్ధికి, వైవిధ్యానికి ఆధారం. ప్రజాస్వామ్యాన్ని సమాజంలోని అన్ని స్థాయిల్లోనూ పెంపొందించాల్సిన అవసరం ఉంది' అని టర్క్ పేర్కొన్నారు.





## యోగా లేదా జిమ్..
# ఏది బెస్ట్ ఆప్షన్?



శరీరాన్ని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉంచుకోవాలనుకుంటే యోగా లేదా వ్యాయామం చేయాల్సిందే.. ప్రస్తుతం ఎక్కువ మంది ఊబకాయం సమస్యతో సతమతమవుతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జిమ్‌లో చెమటలు కక్కుతున్నారు. కొంతమంది వ్యాయామ శిక్షణపై దృష్టి పెడతారు. శారీరక దృఢత్వం, ఆరోగ్యం కోసం వ్యాయామం అనే శారీరక ప్రక్రియను చేస్తారు. ఇలా చేయడం వలన శారీరకంగానే కాదు మనసికమగా కూడా అనేక ప్రయోజనాలను పొందుతారు.మరోవైపు ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను దూరం చేసుకోవాలనుకునే వారు యోగా, ప్రాణాయామం చేస్తుంటారు. యోగాతో మీరు ఏకాగ్రత నేర్చుకుంటారు. యోగా .. జిమ్ వర్కౌట్‌లలో ఏది బెటర్ అనే ప్రశ్న కొంతమందికి ఎప్పుడూ మనసులో ఉంటుంది. ఈ విషయంపై కల్ట్ ట్రాన్స్‌ఫార్మ్ యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోల్లా అనేక విషయాలను చెప్పారు. ఆరోగ్యంగా ఉండాలంటే శరీరాన్ని చురుగ్గా ఉంచుకోవడం చాలా అవసరమని చెబుతున్నారు. దీంతో ఊబకాయం, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులు రాకుండా ఉంటాయి. అంతేకాదు మన శరీరంలోని కండరాలు కూడా ఫ్లెక్సిబుల్‌గా ఉంటాయి. యోగా, జిమ్ వ్యాయామాల మధ్య వ్యత్యాసం ఉంది. ఈ రెండింటి మధ్య తేడా గురించి ముందుగా చెప్పుకుందాం.

**యోగా అంటే ఏమిటి?**

యోగా అనేది భౌతిక భంగిమలు, ధ్యానం, లోతైన శ్వాసలతో కూడిన ఒక పురాతన అభ్యాసం. యోగా అనేది శరీరం, మనస్సు, ఆత్మ ఐక్యంగా ఉండే ఆధ్యాత్మిక ప్రక్రియ. ఈ పదం హిందూమతం, జైనమతం, బౌద్ధమతంలో ధ్యాన ప్రక్రియకు సంబంధించినది. యోగా అనేది సంస్కృత పదం యుజ్ నుండి వచ్చింది. అంటే సేకరించడం లేదా బంధించడం. యోగా ఒక ఆధ్యాత్మిక క్రమశిక్షణ. యోగాలో సూర్య నమస్కారంతో సహా అనేక ఆసనాలు, ప్రాణాయామం ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలు గణనీయంగా యోగా పట్ల ఆసక్తిని చూపిస్తున్నారు.

**జిమ్ వ్యాయామం**

జిమ్ గురించి అందరికీ తెలుసు. వ్యాయామశాలలో వివిధ యంత్రాలతో పాటు గాడ్జెట్లను ఉపయోగించి వ్యాయామం చేస్తారు. ఫిట్ , టోన్డ్ బాడీని పొందడానికి చాలా మంది జిమ్‌కి వెళ్తుంటారు. ప్రజలు జిమ్‌కి వెళ్లి కార్డియో, కాళ్లు , వెయిట్ లిఫ్టింగ్ వంటి వివిధ వ్యాయామాలు చేస్తారు.

**రెండింటిలో ఏది మంచిది?**

రెండు ఆరోగ్యానికి మేలు చేసేవే అని యోగా ఎక్స్‌పర్ట్ దివ్య రోలా చెబుతున్నారు. యోగాలో శ్వాస నియంత్రణ అంటే ప్రాణయ, ఆసనం .. యోగా నిద్ర వంటి అంశాలు ఉంటాయి. ఇది శరీరం, మనస్సు రెండింటినీ రిలాక్స్ చేస్తుంది. అదే సమయంలో జిమ్ వ్యాయామంలో శక్తి శిక్షణ ఉంటుంది. ఇది జీవక్రియ. కండరాలకు మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం మీ శరీర తత్వాన్ని తెలుసుకోండి. మరింత సౌకర్యవంతంగా ఉన్న వాటిని ఆచరించండి.





# వెజిటేరియన్స్ ఎక్కువగా ఉన్న దేశాలెంటో తెలుసా

కొంతమంది చిన్నప్పటి నుంచీ మాంసాహారులు అయినప్పటికీ.. కారణాలు ఏమైనా కాలక్రమంలో శాకాహారులుగా మారిపోతున్నారు. ఇంకొంత మంది పుట్టినప్పటి నుంచీ శాకాహారులుగా ఉన్నా తదనంతర కాలంలో మాంసాహారులవుతున్నారని అంటుంటారు. ఏది ఏమైనప్పటికీ.. ఎవరు ఎలా మారినప్పటికీ.. శాకాహారం తినడమా, మాంసాహారం తినడమా అనేది పూర్తిగా వ్యక్తిగత ఎంపికనే చెప్పాలి. అయితే ఇటీవల కాలంలో ప్రపంచవ్యాప్తంగా చలా మంది ఇప్పుడు శాకాహారాన్ని అవలంభిస్తున్నారని అంటుంటారు. లైఫ్ స్టైల్ ఛేంజ్ లో భాగంగా ఆహారపు అలవాట్లనూ మారుస్తున్నారు. కొంతమంది హెల్త్ కాన్సియస్ కాస్త ఎక్కువగా ఉండి కూడా ఇలాంటి నిర్ణయాలు చేస్తున్నారని చెబుతుంటారు. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా శాకాహారుల సంఖ్య పెరుగుతుందని అంటుంటారు.

**శాకాహారులు ఎక్కువగా ఉన్న టాప్ - 5 దేశాలు...**

**భారతదేశం:**

అత్యధిక సంఖ్యలో శాకాహారం తినేవారు ఎక్కువగా ఉన్న దేశాల్లో అగ్రస్థానంలో ఉంది భారత్. ఇక్కడ ఉన్న జనాభాలో సుమారు 30శాతం మందికి పైగా ప్రజలు శాకాహారమే తింటారని చెబుతున్నారు. ఈ శాతంలో ప్రధాన వాటా హర్యానా, రాజస్థాన్ లలో నివసిస్తున్న ప్రజలని అంటుంటారు!

**ఇజ్రాయెల్:**

ఇజ్రాయెల్ జనాభాలో సుమారు 13 శాతం మంది ప్రజలు శాకాహారులే. మనిషి తన ఆకలిని తీర్చుకోవడానికి జంతువులను చంపడాన్ని సమర్థించలేమని ఇక్కడ నివసించే కొంతమంది ప్రజానికం బలంగా నమ్ముతారంట.

**తైవాన్:**

శాఖాహర ఆహారాన్ని భుజించే జనాభా ఎక్కువగా ఉన్న దేశాల్లో తైవాన్ మూడో స్థానంలో ఉంది. ఇక్కడున్న మొత్తం జనాభాలో 12 శాతం మంది ఇక్కడ శాకాహారాన్నే అనుసరిస్తున్నారు. ఇక్కడ వెజ్ రెస్టారెంట్స్ చాలానే ఉన్నాయి.

**ఇటలీ:**

ఇటలీ జనాభాలో సుమారు 10 శాతం మంది ప్రజలు వెజిటేరియన్స్. వాస్తవానికి ఇటలీ నాన్ వెజ్ వంటకాలకు ఎక్కువ ప్రసిద్ధి చెందినప్పటికీ.. ఇక్కడ శాకాహారుల సంఖ్య కూడా వేగంగా పెరుగుతోందని తాజా నివేదికలు చెబుతున్నాయి.

**ఆస్ట్రియా:**

ప్రపంచ వ్యాప్తంగా శాకాహార ఆహారాన్ని అనుసరించే వ్యక్తుల విషయంలో ఆస్ట్రియా ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ సుమారు 9 శాతం మంది.



# పరగడుపున పనీర్ తింటే.. బోలెడు లాభాలు



చీజ్ అని కూడా పిలువబడే పనీర్, వివిధ రకాల వంటకాలలో ఉపయోగించగల బహుముఖ ప్రయోజనాలు, రుచికరమైన పదార్థం. కానీ., ఉదయాన్నే పనీర్ తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని మీకు తెలుసా..? మీ అల్పాహార దినచర్యలో పనీర్ చేర్చడం మీ మొత్తం శ్రేయస్సుకు ప్రయోజనకరంగా ఉండటానికి వివిధ కారణాలను ఒకసారి చూద్దాం.

**ప్రోటీన్ పుష్కలంగా:**

పనీర్ అధిక నాణ్యత ప్రోటీన్ యొక్క గొప్ప మూలం. ఇది మీ రోజును ప్రారంభించడానికి అనువైన ఆహారంగా మారుతుంది. కణజాలాలను నిర్మించడానికి, మరమ్మతు చేయడానికి, అలాగే ఆరోగ్యకరమైన ఎముకలు, కండరాలు, చర్మాన్ని నిర్వహించడానికి ప్రోటీన్ అవసరం.

**జీవక్రియను పెంచుతుంది:**

ఉదయాన్నే పనీర్ తినడం ద్వారా, మీరు మీ జీవక్రియను పెంచుకోవచ్చు. వేగవంతమైన జీవక్రియ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. ఇంకా రోజంతా మీకు మరింత శక్తిని అందిస్తుంది.

**మీకు కడుపు నిండుగా అనిపించేలా చేస్తుంది:**

పనీర్ అనేది మిమ్మల్ని ఎక్కువ కాలం సంతృప్తిగా, కడుపు నిండుగా ఉండేలా చేయడానికి సహాయపడే ఒక నింపే ఆహారం. ఇది రోజు చివరిలో అనారోగ్యకరమైన ఆహారాలను అతిగా తినడం, అల్పాహారం తీసుకోవడం నివారించవచ్చు.

**అవసరమైన పోషకాలను అందిస్తుంది:**

పనీర్ కాల్షియం, భాస్వరం, విటమిన్ ఎ, బి 12 వంటి విటమిన్లకు మంచి మూలం. బలమైన ఎముకలు, దంతాలు, మొత్తం రోగనిరోధక శక్తిని నిర్వహించడానికి ఈ పోషకాలు ముఖ్యమైనవి.

**రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది:**

ఉదయం పనీర్ తినడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారికి ముఖ్యమైనది. పనీర్ లోని ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు రక్తప్రవాహంలోకి చక్కెర శోషణను నెమ్మదిస్తాయి.





## అమల్లోకి ట్రంప్ టారిఫ్‌లు..

# మార్కెట్‌లు విలవిల..

**రిలయన్స్ సహా బ్లూ చిప్ కంపెనీలకు నష్టాలు..!**



**ముంబై:** కెనడా, మెక్సికో, చైనాల నుంచి దిగుమతులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పెంచిన టారిఫ్ అమల్లోకి రావడంతో అంతర్జాతీయ మార్కెట్లతోపాటు దేశీయ స్టాక్ మార్కెట్లు కూడా మంగళవారం భారీగా పతనం అయ్యాయి. విదేశీ మదుపర్లు నిర్విరామంగా పెట్టుబడులు ఉపసంహరిస్తుండటంతో వరుసగా మూడోసెషన్‌లోనూ నష్టాల పాలైన బీఎస్ఈ -50 ఇండెక్స్ సెన్సెక్స్ మంగళవారం 96 పాయింట్ల పతనంతో 73 వేల పాయింట్ల దిగువన స్థిర పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ 96.01 పాయింట్లు నష్టపోయి 72,989.93 పాయింట్ల వద్ద స్థిర పడింది. బీఎస్ఈ-30లో 18 స్టాక్స్ నష్టాలతో ముగిస్తే, 12 స్టాక్స్ లాభాలతో స్థిర పడ్డాయి. ఇంట్రాడే ట్రేడింగ్‌లో 452.4 పాయింట్ల నష్టంతో 72,633.54 పాయింట్ల కనిష్టానికి పతనమైనా ట్రేడింగ్ ముగిసే సమయానికి రికవరీ సాధించింది.

మరోవైపు ఎన్ఎస్ఈ-50 సూచీ నిఫ్టీ వరుసగా పదో సెషన్‌లో నష్టాలతో ముగిసింది. 36.65 పాయింట్లు పతనమై 22,082.65 పాయింట్ల వద్ద స్థిర పడింది. ట్రేడింగ్ ప్రారంభంలోనే 22 వేల దిగువన 21,974.45 పాయింట్ల వద్ద ట్రేడయింది. అంతర్గత ట్రేడింగ్‌లో నష్టాల నుంచి రికవరీ సాధించింది.

బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్‌లో బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, నెస్లే ఇండియా, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా, ఇన్ఫోసిస్, మారుతి సుజుకి ఇండియా, టైటాన్, హిందూస్థాన్ యూనీ లివర్, రిలయన్స్ ఇండస్ట్రీస్ నష్టాలతో ముగిశాయి. మరోవైపు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), జొమాటో, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), అదానీ పోర్ట్స్, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, హెచ్డీఎఫ్‌సీ బ్యాంకు లాభ పడ్డాయి.

ఆసియా మార్కెట్లలో టోక్యో, హాంకాంగ్, సియోల్ నష్టాలతో ముగిస్తే, షాంఘై లాభాలతో స్థిర పడింది. యూరోపియన్ మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. సోమవారం అమెరికా మార్కెట్‌లు నష్టపోయాయి. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 1.37శాతం పతనమై 70.64 డాలర్లు పలుకుతోంది. సోమవారం నాడు దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.4,788.29 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

## భారత్‌లో టెస్లా మొదటి షోరూమ్ ఇక్కడే..

**ఎలాన్ మస్క్ కీలక ఒప్పందం!**




**ముంబై:** ముంబైలో తన మొదటి షోరూమ్ కోసం ఒప్పందాన్ని ఖరారు చేయడంతో టెస్లా భారతదేశంలో ప్రారంభించటానికి దగ్గరగా ఉంది. వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీయ మార్కెట్‌లోకి ప్రవేశించడానికి సిద్ధమవుతున్న ఈ సమయంలో కంపెనీకి ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఇటీవలి మీడియా నివేదికల ప్రకారం, టెస్లా ముంబైలోని ప్రధాన బాంద్రా-కుర్లా కాంప్లెక్స్‌లో 4,000 చదరపు అడుగుల వాణిజ్య సముదాయాన్ని బుక్ చేసుకుంది.

**రూ.35 లక్షల అద్దె:**

ఈ ఫ్లాగ్‌షిప్ షోరూమ్ టెస్లా తాజా ఎలక్ట్రిక్ మోడళ్లను ప్రదర్శిస్తుంది. టెస్లా నెలవారీ అద్దెను దాదాపు రూ.35 లక్షలు (చదరపు అడుగుకు రూ.900)గా నిర్ణయించింది. లీజు ఒప్పందం ఐదు సంవత్సరాలు. టెస్లా ఇప్పటికే ఢిల్లీలోని ఏరోసిటీ కాంప్లెక్స్‌లో రెండవ షోరూమ్‌ను ప్రారంభించాలని యోచిస్తోంది. టెస్లా భారతదేశంలో తన ఉనికిని విస్తరించాలని యోచిస్తోంది. అలాగే దీని కోసం కంపెనీ ఢిల్లీ, ముంబై, పూణే వంటి నగరాల్లో అనేక ప్రాంతాలను ఎంచుకోగా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్, ప్రధాని నరేంద్ర మోడీ మధ్య జరిగిన సమావేశం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఆ కంపెనీ తన మొదటి షోరూమ్‌ను ముంబైలోని బాంద్రా కుర్లా కాంప్లెక్స్‌లో ప్రారంభించాలని యోచిస్తోంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన ప్రాంతాలలో ఒకటి. దీనితో పాటు టెస్లా ఢిల్లీలోని ఏరోసిటీలో తన షోరూమ్‌ను కూడా ప్రారంభించాలని యోచిస్తోంది. భారతదేశంలోకి టెస్లా ప్రవేశం ఎలక్ట్రిక్ వాహన మార్కెట్‌లో పోటీని పెంచడమే కాకుండా భారతదేశ ఆటోమొబైల్ రంగానికి ఒక కొత్త విప్లవంగా కూడా నిరూపించుకోనుంది.

**ధర ఎంత ఉంటుంది?**

టెస్లా మోడల్స్ భారతదేశంలో ప్రీమియం ఆఫర్‌లుగా ఉండనున్నాయి. ధరలు దాదాపు రూ. 21 లక్షల నుండి ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

## పేటీఎంకు ఈడీ నోటీసులు..

**రూ.611 కోట్ల మోసం ఆరోపణలు!**




**న్యూఢిల్లీ:** విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం, 1999 ఉల్లంఘనకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కమ్యూనికేషన్ లిమిటెడ్ (మాతృ సంస్థ), దాని మేనేజింగ్ డైరెక్టర్‌తో సహా ఇతర సంబంధిత కంపెనీలకు షో కాజ్ నోటీసు జారీ చేసింది. ఈ కేసులో మొత్తం రూ.611 కోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. వన్97 కమ్యూనికేషన్ లిమిటెడ్ సింగపూర్‌లో విదేశీ పెట్టుబడులు పెట్టిందని, కానీ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి అవసరమైన నివేదికను అందించలేదని ఈడీ దర్యాప్తులో తేలింది. దీనితో పాటు కంపెనీ విదేశీ పెట్టుబడిదారుల నుండి విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను కూడా పొందింది. కానీ ఆర్బీఐ నిర్దేశించిన ధరల నియమాలను ఇందులో పాటించలేదని తేలింది.

## సెమీస్‌లో ఆస్ట్రేలియాపై టీమిండియా

# గ్రాండ్ విక్టరీ

## ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్

**4 వికెట్ల తేడాతో ఘన విజయం**

**అర్ధ శతకంతో రాణించిన కోహ్లీ**

**ఆసీస్‌ను కంగారెత్తించిన భారత బౌలర్లు**



**దుబాయి:** ఛాంపియన్స్ ట్రోఫీ తొలి సెమీఫైనల్లో టీమిండియా ఆస్ట్రేలియాపై 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆదివారం జరగనున్న ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్‌కు చేరుకుంది. 265 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో భారత జట్టు 48 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. విరాట్ కోహ్లీ 84 పరుగులు చేసి ఔటయ్యాడు. ఆడమ్ జంపా బౌలింగ్‌లో బెన్ ద్వార్షిస్‌కు క్యాచ్ ఇచ్చాడు. విరాట్ కాకుండా అక్షర్ పటేల్ 27, శ్రేయాస్ అయ్యర్ 45, కెప్టెన్ రోహిత్ శర్మ 28 పరుగులు చేయగా, శుభ్మాన్ గిల్ 8 పరుగులు చేసి ఔటయ్యాడు. అక్షర్ ను నాథన్ ఎల్లిస్ బౌలింగ్ లో బౌల్డ్ చేయగా, శ్రేయాస్ ను ఆడమ్ జంపా బౌలింగ్ లో బౌల్డ్ చేశాడు. కొన్నోలీ బౌలింగ్‌లో రోహిత్ కూపర్ ఎల్బీగా వెనుదిరిగాడు. అంతకుముందు ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. ఆ జట్టు 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌట్ అయింది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ 96 బంతుల్లో 73 పరుగులు చేశాడు. అలెక్స్ కారీ 61 పరుగులు, ట్రావిస్ హెడ్ 39 పరుగులు చేశారు. భారత్ తరఫున మహ్మద్ షమీ 3 వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా, వరుణ్ చక్రవర్తి చెరో 2-2 వికెట్లు పడగొట్టారు. మ్యాచ్ లో టీమిండియా బౌలర్లు అదరగొట్టారు. ఒక దశలో 300 పరుగులు చేసేలా కనిపించిన ఆసీస్ కు చివరి ఓవర్లలో కళ్లెం వేశారు. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియా 49.3 ఓవర్లలో 264 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్ (96 బంతుల్లో 73బీ 4 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ గా నిలిచాడు. అలెక్స్ క్యారీ (57 బంతుల్లో 61బీ 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో రాణించాడు. ట్రావిస్ హెడ్ (39) దూకుడుగా ఇన్నింగ్స్ ను ఆరంభించినా వరుణ్ చక్రవర్తికి బలయ్యాడు. భారత బౌలర్లలో మొహమ్మద్ షమీ 3 వికెట్లు తీశాడు. వరుణ్ చక్రవర్తి, రవీంద్ర జడేజాలకు చెరో రెండు వికెట్లు లభించాయి. బ్యాటింగ్ కు దిగిన ఆస్ట్రేలియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలింది. మ్యాథ్యూ షార్ట్ స్థానంలో జట్టులోకి వచ్చిన కూపర్ (0) డకౌట్ అయ్యాడు. అయితే ఆ ఆనందం భారత బౌలర్లకు ఎంతో సేపు నిలవలేదు. హెడ్ హిట్టింగ్ మొదలు పెట్టాడు. ఎడాపెడా బౌండరీలు బాదాడు. దాంతో ఆసీస్ ఓవర్ కు 6 పరుగుల చొప్పున రన్ రేట్ ను మెయింటేన్ చేస్తూ ముందుకు సాగింది. అయితే వరుణ్ చక్రవర్తి డేంజరస్ హెడ్ ను అవుట్ చేశాడు. అనంతరం మార్నస్ లబుషేన్ (29)తో కలిసి స్మిత్ జట్టును ముందుకు నడిపాడు. వీరిద్దరు నెమ్మదిగా ఆడారు. అయితే కీలక సమయంలో లబుషేన్ అవుటయ్యాడు. ఆ వెంటనే ఇంగ్లీస్ (11) కూడా పెవిలియన్ కు చేరాడు. ఈ దశలో స్మిత్, అలెక్స్ క్యారీలు జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు సమయోచితంగా ఆడారు. 30 ఓవర్లు దాటాకా వీరిద్దరు హిట్టింగ్ చేశారు. ఫలితంగా ఆస్ట్రేలియా 300 పరుగులు చేసేలా కనిపించింది. అయితే స్మిత్ ను షమీ అవుట్ చేశాడు. ఆ వెంటనే సిక్సర్ కొట్టి ఊపుమీద కనిపించిన మ్యాక్స్ వెల్ (7)ను అక్షర్ పటేల్ క్లీన్ బౌల్డ్ చేశాడు. ఇక చివర్లో అలెక్స్ క్యారీ అవుటవ్వడంతో ఆస్ట్రేలియా 264 పరుగులకు పరిమితం అయ్యింది.






## రెజ్లర్ సుశీల్‌కుమార్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట..

**హత్య కేసులో బెయిల్**

**న్యూఢిల్లీ:** భారత స్టార్ రెజ్లర్, ఒలింపియన్ సుశీల్ కుమార్‌కు ఢిల్లీ హైకోర్టులో ఊరట లభించింది. జూనియర్ రెజ్లర్ సాగర్ ధన్‌కర్ హత్య కేసులో సుశీల్ కుమార్‌కు రెగ్యులర్ బెయిల్ దక్కింది. జూనియర్ రెజ్లర్ సాగర్ ధన్‌కర్ 2021లో హత్యకు గురయ్యాడు. దాంతో పోలీసులు 2021 మే నెలలో సుశీల్ కుమార్‌ను అరెస్ట్ చేశారు. ఇదే కేసులో గతంలో కూడా సుశీల్‌కు బెయిల్ దొరికింది.

2023 జూలైలో మోకాలి శస్త్రచికిత్స కోసం ఆయనకు 7 రోజులపాటు మధ్యంతర బెయిల్ లభించింది. మంగళవారం ఢిల్లీ హైకోర్టు రెగ్యులర్ బెయిల్ ఇచ్చింది. కాగా సుశీల్ కుమార్ ఒలింపిక్స్‌లో భారతదేశానికి రజత, కాంస్య పతకాలు అందించారు. సాగర్ ధన్‌కర్ హత్య కేసులో మొత్తం 18 మంది నిందితులుగా ఉన్నారు. వారిలో సుశీల్ కుమార్ కూడా ఒకరిగా ఉన్నాడు. కాగా ఢిల్లీలోని ఛత్రసాల్ స్టేడియం వద్ద 2021 మే 4న సాగర్‌తోపాటు అతని స్నేహితులు సోను, అమిత్ కుమార్‌లపై సుశీల్ కుమార్, అతని స్నేహితులు దాడి చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సాగర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సుశీల్‌కుమార్‌పై, అతని స్నేహితులపైన హత్య కేసులు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు.



## వన్డేల్లో అత్యధిక క్యాచ్‌లు



**రికీ పాంటింగ్ రికార్డు సమం చేసిన కోహ్లీ**

**దుబాయి:** ఛాంపియన్స్ ట్రోఫీలో భాగంగా ఇటీవల పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 157వ క్యాచ్ అందుకున్న విరాట్ కోహ్లీ.. వన్డేల్లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న భారత ఆటగాడిగా సరికొత్త రికార్డు నెలకొల్పాడు. తన 299వ మ్యాచ్‌లో కోహ్లీ ఈ ఫీట్ సాధించాడు. అప్పటిదాకా ఈ రికార్డు భారత జట్టు మాజీ కెప్టెన్ మహ్మద్ అజహరుద్దీన్ పేరిట ఉండేది. అజహరుద్దీన్ 334 మ్యాచ్‌లలో 156 క్యాచ్‌లు అందుకున్నాడు.

అయితే కోహ్లీ ఇవాళ ఆస్ట్రేలియాతో జరుగుతున్న సెమీఫైనల్ మ్యాచ్‌లో తన క్యాచ్‌ల రికార్డును మరింత మెరుగుపర్చుకున్నాడు. 160వ క్యాచ్ అందుకోవడం ద్వారా ఆస్ట్రేలియా టీమ్ మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ రికార్డును సమం చేశాడు. రవీంద్ర జడేజా బౌలింగ్‌లో జోష్ ఇంగ్లిష్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకోవడం ద్వారా ఈ ఘనత సాధించాడు. ప్రస్తుతం అంతర్జాతీయ వన్డే క్రికెట్‌లో అత్యధిక క్యాచ్‌ల రికార్డు శ్రీలంక టీమ్ మాజీ కెప్టెన్ మహేళ జయవర్ధనే పేరిట ఉంది.

మహేళ జయవర్ధనే అంతర్జాతీయ వన్డేల్లో మొత్తం 218 క్యాచ్‌లు అందుకున్నాడు. ఆ తర్వాత 160 క్యాచ్‌లతో రికీ పాంటింగ్ రెండో స్థానంలో ఉన్నాడు. ఇవాళ పాంటింగ్ రికార్డును కోహ్లీ సమం చేశాడు. మరో క్యాచ్ అందుకుంటే వన్డేల్లో అత్యధిక క్యాచ్‌లు అందుకున్న రెండో ఆటగాడిగా కోహ్లీ కొత్త రికార్డు నెలకొల్పనున్నాడు.

## కంచిపట్టు చీరలో కండలరాణి..

**ప్రీ వెడ్డింగ్ షూట్‌లో చిత్రా స్టన్నింగ్ లుక్..**

**బెంగుళూరు:** కర్నాటక బాడీబిల్డర్ చిత్రా పురుషోత్తం ఇప్పుడు ఇంటర్నెట్‌లో హాట్ టాపిక్ అయ్యారు. ఆ కండల రాణి.. తన పెళ్లి కోసం ప్రిపేరవుతున్నది. ఈ నేపథ్యంలో నిర్వహించిన ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్ అందర్నీ ఆకట్టుకుంటున్నది. కంచిపట్టు చీర కట్టి.. ఆ చీర కట్టులో కండల్ని ప్రదర్శిస్తున్న చిత్రా పిక్స్, వీడియోలు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో వైరల్ అవుతున్నాయి. ఎల్లో, బ్లూ రంగు పట్టు చీరలో చిత్ర చాలా సంప్రదాయమైన రీతిలో తన లుక్‌ను ప్రజెంట్ చేసింది.

అయితే బ్లౌజ్ లేకుండా ఉన్న ఆ పిక్స్‌లో .. బాడీబిల్డర్ చిత్ర తన కండ బలాన్ని చూపించింది. బాడీ బిల్డర్ చిత్ర..ఓ బ్యూటీ క్వీన్‌లా తయారైంది. బంగారు ఆభరణాలను ధరించింది. నెక్లెస్‌లు, చేతి గాజులు వేసుకున్నాయి. చెవి పోగులు కూడా ధరించింది. ఎర్రటి పెదవులతో .. తనలో పెళ్లి కళను ఆ లుక్‌తో ఆమె చాటుకున్నది. చాలా భిన్నమైన రీతిలో ఆ ప్రి వెడ్డింగ్ ఫోటోషూట్ జరిగింది.

చిత్ర పోస్టు చేసిన తన వీడియోకు 34 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. ఇంకా చాలా మంది తమ రియాక్షన్స్‌తో థ్రిల్ చేశారు. ఆమె ఫిట్‌నెస్‌ను అనేక మంది మెచ్చుకున్నారు.



కొందరైతే నవ్వుకుంటున్నట్లు కూడా రిప్లైలు ఇచ్చారు. వధువు అలంకరణతో పాటు బాడీబిల్డింగ్ పతకాలు కూడా ఆమె ధరిస్తే



మంచిదే అన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చిత్రలో ఉన్న కాన్ఫిడెన్స్, డెడికేషన్‌ను అనేక మంది ప్రశ్నించారు.

# ఒకేసారి 500 మందితో హృతిక్, ఎన్టీఆర్ డ్యాన్స్




టాకీస్: దేవరతో సాలిడ్ హిట్ అందుకున్న అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ ప్రస్తుతం వార్ 2 సినిమాతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. వార్ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రంలో హృతికి రోషన్ కథానాయకుడిగా నటిస్తుండగా.. తారక్ కీలక పాత్రలో మెరుస్తున్నాడు. ఆదిత్య చోప్రా ఈ సినిమాను నిర్మిస్తుండగా.. అయన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా వుంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ న్యూస్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమాలో హృతిక్, ఎన్టీఆర్ మధ్య క్రేజీ డ్యాన్స్ సీక్వెన్స్ ఉండబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. తాజాగా సినిమాలోని పాట కోసమే ఏకంగా 500 మంది డ్యాన్స్?ర్లను రంగంలోకి దింపినట్లు వార్తలు వస్తున్నాయి. 500 మంది డ్యాన్సర్లతో హృతిక్, ఎన్టీఆర్ డ్యాన్స్ చేస్తుంటే థియేటర్‌లు ఏ రేంజ్‌లో ఊగిపోతాయో అని ప్రేక్షకులు ఎదురు చూస్తున్నారు. హృతిక్, ఎన్టీఆర్ మధ్య వచ్చే ఈ డ్యాన్స్‌లో మునుపెన్నడూ చూడని విధంగా ఓ సరికొత్త గీతాన్ని తీర్చిదిద్దుతుంది చిత్రబృందం.

# బిగ్‌బాస్9 సీజన్‌కు హోస్ట్‌గా విజయ్‌దేవరకొండ



**టాకీస్:** బుల్లితెర రియాలిటీ షో బిగ్ బాస్ తెలుగుకి ప్రేక్షకులలో మంచి ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు 8 సీజన్‌లు విజయవంతంగా కంప్లీట్ చేసుకున్న ఈ షో 9వ సీజన్‌కి సిద్ధమవుతుంది. ఇక 9వ సీజన్ మరింత రసవత్తరంగా ఉండబోతున్నట్లు తెలుస్తుంది. ఇదిలావుంటే కొత్త సీజన్‌కి కొత్త హోస్ట్ రాబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే వచ్చిన 8 సీజనలలో మొదటి సీజన్‌కి అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ హోస్ట్ చేయగా ఆ తర్వాత వచ్చిన సెకండ్ సీజన్‌కి నాని వ్యాఖ్యతగా వ్యవహారించాడు. ఇక మూడవ సీజన్ నుంచి ఇప్పటివరకు సక్సెస్‌ఫుల్ హోస్ట్‌గా రాణిస్తున్నాడు కింగ్ నాగార్జున. అయితే తాజాగా వచ్చే కొత్త సీజన్‌కి టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ హోస్ట్‌గా చేయబోతున్నట్లు తెలుస్తుంది. దీపికి సంబంధించిన వార్తలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇక ఈ వార్త విన్న విజయ్ అభిమానులు సోషల్ మీడియాలో ట్రెండ్ చేయడం మొదలుపెట్టారు. కాగా ఇందుకు సంబంధించి బిగ్ బాస్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. విజయ్ సినిమాల విషయానికి వస్తే.. ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరితో కింగ్‌డమ్ అనే సినిమాలో నటిస్తున్నాడు. ఈ సినిమాను సితార ఎంటర్‌టైనమెంట్స్ బ్యానర్‌పై సూర్య దేవర నాగవంశీ నిర్మిస్తుండగా.. అనిరుధ్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రం మే 30న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# 15 ఏళ్లలో ప్రేమ, పెళ్లి, విడాకులు సమంత సినీ జీవితంలో ఎన్నో మలుపులు

టాకీస్: టాలీవుడ్ అందాల ముద్దుగుమ్మ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. స్టార్ హీరోయిన్‌గా ఓ రేంజ్‌లో పాపులారిటీ సంపాదించుకున్న ఈ భామ ఆ తర్వాత నాగ చైతన్యని ప్రేమించి పెళ్లి చేసుకుంది. సంసారం సజావుగా సాగుతున్న సమయంలో ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి అతని నుండి విడిపోయింది. ఇక ప్రస్తుతం సింగిల్‌గా ఉంటుంది. ఇక చైతూ నుండి విడిపోయిన తర్వాత సమంతకి మయోసైటిస్ అనే వ్యాధి బయటపడింది. చాలా రోజుల పాటు ఈ వ్యాధితో బాధపడ్డ సమంత సినిమాలకి కూడా బ్రేక్ ఇచ్చింది. అయితే చివరికి ఆ వ్యాధితో ధీటుగా ఎదుర్కొని మళ్లీ సినిమాలతో అలరించేందుకు సిద్ధమవుతుంది. అయితే సమంత సినిమాల్లోకి వచ్చి 15 ఏళ్లు పూర్తయ్యాయి. 2010లో విడుదలైన ఏ మాయ చేసావే సినిమా ద్వారా సమంత ఆరంగేట్రం చేసింది. ఈ మూవీ ఫిబ్రవరి 26,2010న విడుదలై పెద్ద విజయం సాధించింది. ఈ సినిమాలో సమంతతో చైతూ జంటగా నటించాడు. ఈ మూవీ సమయంలోనే వారిద్దరి మధ్య ప్రేమ పుట్టిందని టాక్. అయితే ఏ మాయ చేశావే సినిమా విడుదలై 15 ఏళ్లు కావడంతో, సమంత సినీ జర్నీ కూడా 15 ఏళ్లు పూర్తి అయింది. ఈ సినీ ప్రయాణంలో సమంత.. అల్లు అర్జున్, ఎన్టీఆర్, పవన్ , మహేష్, రామ్ చరణ్ లాంటి స్టార్ హీరోల సరసన నటించి అలరించిఆంది. తమిళంలో కూడా వరుస సినిమాలు చేసింది. చివరిగా సమంత తెలుగులో ఖుషి, తమిళంలో కాతువాక్కుల రెండు కాదల్ సినిమాల్లో నటించింది.



టాకీస్: హిట్టు, ఫ్లాప్‌లతో సంబంధం లేకుండా వరుసగా సినిమాలు చేసుకుంటూ వెలుతున్నాడు సుధీర్ బాబు. గతేడాది హరోంహర, మా నాన్న సూపర్ హీరో సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రాగా.. ఇవి మిక్స్‌డ్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచాయి. దీంతో ఎలాగైన హిట్ కొట్టాలనే కసితో

# టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న సోనాక్షి సిన్హా

ప్రస్తుతం జటాధర అనే సినిమా చేస్తున్నాడు. మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాకి వెంకట్ కల్యాణ్ కథనందిస్తూ దర్శకత్వం వహిస్తుండగా.. తెలుగు, హిందీ బైలింగ్యువల్ ప్రాజెక్ట్‌గా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు సంబంధించి ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సినిమాతో బాలీవుడ్ నటి సోనాక్షి సిన్హా తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. మార్చి 08 నుంచి సోనాక్షి జటాధర షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఇటీవలే హీరమండి: డైమండ్ బజార్ అనే వెబ్ సిరీస్‌తో వచ్చి సూపర్ హిట్ అందుకుంది సోనాక్షి.

# సిరాజ్‌తో డేటింగ్‌పై నోరువిప్పిన బిగ్‌బాస్ బ్యూటీ




**టాకీస్:** ఇండియన్ స్టార్ క్రికెటర్‌లు, బాలీవుడ్ హీరోయిన్‌ల మధ్య డేటింగ్ వార్తలు రావడం సహజమే అన్న విషయం తెలిసిందే. ఇప్పటికే పలువురు క్రీడ ప్రముఖులు సినీ నటుల మధ్య వార్తలు రాగా.. అందులో కొన్ని నిజం కూడా అయ్యాయి. అయితే తాజాగా స్టార్ క్రికెటర్ మొహమ్మద్ సిరాజ్‌తో బిగ్‌బాస్ 13 ఫేమ్ నటి మహిరా శర్మ డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు వైరల్ అయ్యాయి. దీనికి ముఖ్య కారణం సిరాజ్, మహిరాలు ఇన్‌స్టాగ్రామ్ ఒకరినొకరు ఫాలో అవ్వడమే. అయితే ఈ ఫాలోయింగ్ లైక్‌ల వరకు వెళ్లడంతో వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారా అని గాసిప్స్ స్టార్ట్ అయ్యాయి. అయితే ఈ పుకార్లపై తాజాగా స్పందించింది మహిరా శర్మ. బాలీవుడ్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నేను ఎవరినీ డేట్ చేయడం లేదు. సిరాజ్‌తో డేటింగ్ అంటూ వస్తున్న వార్తలు నిజం కాదు. పబ్లిక్ ఫిగర్‌గా ఇలాంటి పుకార్లను ఎదుర్కోవడం సర్వసాధారణం. అభిమానులు తమకు నచ్చిన విధంగా ఎవరితోనైనా లింక్‌లు పెడుతారు. ఇంతకుముందు బిగ్ బాస్‌లో ఉన్నప్పుడు కూడా ఇలాంటివి జరిగాయంటూ మహిరా చెప్పుకొచ్చింది.

# నటుడు కార్తీకి ప్రమాదం..

## ఆగిపోయిన 'సర్దార్ 2' షూటింగ్



**టాకీస్:** తమిళ నటుడు కార్తికి ప్రమాదం జరిగింది. ఆయన హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'సర్దార్ 2' 2022లో వచ్చిన స్పై, యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'సర్దార్'కి సీక్వెల్‌గా ఈ చిత్రం రాబోతుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ కర్ణాటకలో శరవేగంగా జరుపుకుంటుంది. అయితే ఈ సినిమాలో యాక్షన్ సన్నివేశాలు తీస్తుండగా కార్తికి ప్రమాదం జరిగింది. దీంతో అతడి కాలికి గాయం కాగా.. వెంటనే స్పందించిన చిత్రబృందం అతడిని ఆస్పత్రికి తరలించింది.

ప్రస్తుతం కార్తికి ఎలాంటి ఇబ్బంది లేదు కానీ వారంపాటు విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు సూచించినట్లు సమాచారం. దీంతో షూటింగ్‌ను మధ్యలోనే ఆపేసినట్లు టాక్. అయితే కార్తికి ఇది రెండో ప్రమాదం. ఇంతకుముందు కూడా సర్దార్ 2 సినిమా షూటింగ్‌లోనే ప్రమాదం జరిగింది. సర్దార్ 2 సినిమా విషయానికి వస్తే.. ఇందులో కార్తి, రజిషా విజయన్ తో పాటు ఎస్జే సూర్య, మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ నటిస్తున్నారు.

# మాధురిని రక్తంవచ్చేలా ముద్దుపెట్టిన హీరో




**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరోయిన్ మాధురి దీక్షిత్ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. తన నటనతో 1980-90ల్లో బాలీవుడ్‌ని ఓ ఊపు ఊపేసింది. దాదాపు 70కి పైగా చిత్రాల్లో నటించిన ఈ ముద్దుగుమ్మ తన డ్యాన్స్‌తో పాటు న టనతో ప్రేక్షకుల్ని కట్టిపడేసింది. అయితే 'బాలీవుడ్ డ్యాన్సింగ్ క్వీన్'గా పేరు తెచ్చుకున్న ఈ ముద్దుగుమ్మ కెరీర్‌లో కూడా ఒక మరిచిపోలేని చేదు సంఘటన ఉంది. తన కెరీర్‌లో బిగినింగ్ టైంలో వినోద్ ఖన్నాతో చేసిన ఒక మూవీలో ఈ ఘటన జరిగింది. 1984లో "అబోధ్" సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టింది మాధురి దీక్షిత్. తొలి సినిమాతోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది ఈ నటి. అయితే 1988లో బాలీవుడ్ సీనియర్ నటుడు వినోద్ ఖన్నా ప్రధాన పాత్రలో వచ్చిన చిత్రం దయావన్. 1987లో కమల్ హాసన్ నటించిన బ్లాక్ బస్టర్ చిత్రం నాయకన్ సినిమాకి ఇది రీమేక్‌గా తెరకెక్కింది. ఈ చిత్రంలో మాధూరి కథానాయికగా నటించగా.. ఫిరోజ్ ఖాన్ దర్శకత్వం వహించాడు. అయితే ఈ సినిమా షూటింగ్‌లో భాగంగా వినోద్ ఖాన్నా మాధూరి పెదవులు కొరకడం అప్పట్లో పెద్ద వివాదానికి దారి తీసింది. చిత్ర షూటింగ్‌లో భాగంగా.. ఆజ్ ఫిర్ తుమ్ పే ప్యార్ ఆయా హైపాట చిత్రీకరిస్తుండగా.. వినోద్ మాధురిని ముద్దు పెట్టుకోవాల్సి వచ్చింది. అయితే ఈ సీన్ కంప్లీట్ అయ్యి దర్శకుడు కట్ చెప్పిన అనంతరం కూడా వినోద్ మాధూరిని ముద్దు పెట్టుకోవడం ఆపకపోగా.. ఆమె పెదవి కొరకడంతో రక్తం కారి ఆమె ఏడ్చినట్లు నివేదికలు తెలిపాయి. దీంతో షూటింగ్ అనంతరం మాధురికి వినోద్ క్షమాపణలు చెప్పినట్లు సమాచారం.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.